ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం 5

జిల్లా వార్తలు

శనివారం 16 , మార్చి 2024



లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మండల కన్వీనరు రెంటపల్లి సుబ్బారెడ్డి, సర్పంచులు, నాయకులు

ఒకవైపు పార్టీలోకి పెద్దఎత్తున వివిధ వర్గాల చేరికలు, మరోవైపు బాబు ష్యూరిటీ- సూపర్ సిక్స్‌పై ఇంటింటి ప్రచారం, ఇంకోవైపు 17న బొప్పూడి వద్ద టీడీపీ కూటమి నిర్వహించే బహిరంగ సభ సక్సెస్ చేయడం కోసం ఏర్పాట్లు తదితర కార్యక్రమాలతో జిల్లాలోని ఏ ప్రాంతంలో చూసినా టీడీపీ అభ్యర్థులు ప్రస్తుతం బీజీబిజీగా మారిపోయారు. అదే సమయంలో కేడర్ కూడా ఈ పరిణామాలతో మరింత జోష్‌గా కనిపిస్తున్నారు. దీనికితోడు ఇప్పటికే దాదాపు అభ్యర్థుల ప్రకటన కూడా పూర్తయ్యింది. నోటిఫికేషన్ రాగానే ఎన్నికలకు సిద్ధం అన్నట్లుగా తెలుగుదేశం పార్టీ పరిస్థితి నెలకొంది.

- చేరికలు... ఇంటింటి ప్రచారం...
- ప్రజాగళం సభ సక్సెస్ కోసం ఏర్పాట్లు
- బిజీబిజీగా ఎమ్మెల్యే అభ్యర్థులు
- జోరు మీద ఉన్న పార్టీశ్రేణులు
- నేడు పార్టీలో చేరనున్న ఎంపీ మాగుంట, మరి కొందరు

టీడీపీలో జోష్

ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గతంలో నామినేషన్లు దాఖలు సమయం వరకు టీడీపీలో అభ్యర్థులు ఎంపిక కొలిక్కి వచ్చేది కాదు. అలాంటిది ఈసారి అధినేత చంద్రబాబు అందుకు భిన్నంగా ముందే ప్రకటించారు. జిల్లాలోని ఎనిమిది స్థానాల్లో ఐదింటికి పదిరోజుల క్రితం తొలి జాబితాలోనే అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన మూడు స్థానాల్లో ఇద్దరిని గురువారం ప్రకటించారు. అలా అసెంబ్లీ అభ్యర్థులు ఏడుగురు ఖరారు కాగా ఒంగోలు పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తాడన్న స్పష్టత వచ్చింది. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. అంతేకాక కుమారుడు రాఘవరెడ్డితోపాటు అనుచరులతో కలిసి శనివారం ఉండవల్లిలో అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఈ పరిణామాలన్ని జిల్లాలోని టీడీపీ కేడర్‌లో జోష్‌ను పెంచాయి. అదే సమయంలో అసెంబ్లీ అభ్యర్థులుగా ఖరారైన వారు ఎన్నికల ప్రక్రియలో తీసుకొనే చర్యలలో మరింత వేగం పెంచారు.

ఇప్పటికే ప్రజల్లోకి..

ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే ఇన్‌చార్జీలుగా అధినేత రూపొందించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం పేరుతో ప్రజల మధ్య ఉంటున్నారు. అలాంటిది ప్రస్తుతం ఎన్నికల క్యాంపెయిన్‌గానే దానిని నిర్వహిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ పోకడ, వైఫల్యాలు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, వైసీపీ నేతల అవినీతి, అరాచక వ్యవహారాలను ప్రజల్లో ఎండగడుతున్నారు. దాంతోపాటు టీడీపీ మేనిఫెస్టో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. అలా నిత్యం ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

గతంలో ఎన్నడూలేని విధంగా చేరికలు

మరోవైపు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా నియోజకవర్గాల్లో వైసీపీని వీడి నిత్యం వందలాది కుటుంబాల వారు టీడీపీలో భారీగా చేరుతున్నారు. ప్రతి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సమక్షంలో నిత్యం ఇలా పెద్దసంఖ్యలో చేరుతున్నారు. తాజాగా టీడీపీ, జనసేనతో పాటు కూటమిలోకి బీజేపీ కూడా చేరిన నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని బొప్పూడి వద్ద భారీ బహిరంగసభను ఈనెల 17న కూటమి తరఫున ఏర్పాటు చేశారు. దానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న తెలిసిందే. సభ జరిగే బొప్పూడి ఉమ్మడి జిల్లా సరిహద్దు కావడంతో ఆ సభకు జిల్లా నుంచి భారీ జన సమీకరణ చేయాలని అధిష్ఠానం నుంచే సంకేతాలు అందాయి. దీంతో రెండు రోజులుగా అందుకు సంబంధించి ఏర్పాట్లపై ప్రత్యేకదృష్టిని వారు సారించారు. అలా ఒకవైపు భారీగా పార్టీలోకి చేరికలు, మరోవైపు ఇంటింటా ప్రచారం, ఇంకొకవైపు బొప్పూడి సభ సక్సెస్ కోసం ఏర్పాట్లతో నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఇతర ముఖ్య నేతలు తీరిక లేకుండా పనిచేస్తున్నారు. అందులోభాగంగా శుక్రవారం కూడా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది.



ఒంగోలు నగరంలో దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరిన 21వ డివిజన్‌కు చెందిన వైసీపీ కుటుంబాల వారు

ముఖ్యనేతలతో భేటీలు

ఆయా ప్రాంతాల్లో పరిశీలిస్తే కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి బొప్పూడి సభ ఏర్పాట్లపై కొండపి, టంగుటూరుల్లో పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేశారు. పొన్నలూరు మండలం జడ్.ఉప్పలపాడులో రాత్రికి టీడీపీలో భారీగా చేరికలు జరిగాయి. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులతోపాటు ప లువురు ఇతర వర్గాల వారు టీడీపీలో చేరారు. అలా చేరిన వారిలో రిటైర్డ్ తహసీల్దార్ కూడా ఉన్నారు. సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నియోజకవర్గ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. బొప్పూడి సభకు జనసమీకరణ అంశాలపై చర్చించారు. అలాగే రాత్రికి చీమకుర్తి మండలం కేవిపాలెంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనిగిరి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు వెల్లువెత్తుతున్నాయి. ఉగ్ర సమక్షంలో సీఎస్‌పురం, పామూరు మండలాలకు చెందిన వారు పార్టీలో చేరగా సాయంత్రం బొప్పూడి సభపై టీడీపీ జనసేన సంయుక్త సమావేశం జరిగింది. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు గెలుపు కోరుతూ శుక్రవారం ఉదయం దోర్నాల మండలం అయినముక్కల ఎస్సీ కాలనీవాసులు శ్రీశైలానికి చేపట్టిన పాదయాత్రను ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు సాయంత్రం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమక్షంలో పుల్లలచెరువు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి పార్టీలో చేరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గిద్దలూరు అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి సమక్షంలో పలు కుటుంబాల వారు శుక్రవారం టీడీపీలో చేరారు. అలాగే మార్కాపురం నియోజకవర్గంలో పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జీ కందుల రామిరెడ్డి సమక్షంలో చిన్నరాయుడుపల్లి వాసులు టీడీపీలో చేరారు. అలాగే పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటి ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఆ కార్యక్రమాల్లో స్థానిక జనసేన నేతలు కూడా పాల్గొంటున్నారు.



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి, టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్య



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ విజయ్ కుమార్

వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన మండల కన్వీనర్
- క్షేత్రస్థాయిలో అధికారపార్టీకి చేజారుతున్న కేడరు
- గెలుపు కసితో పనిచేస్తున్న టీడీపీ కార్యకర్తలు

పుల్లలచెరువు, మార్చి 15: పుల్లలచెరువు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీని విడి ఆ పార్టీ మండల కన్వీనరు రెంటపల్లి సుబ్బారెడ్డి టీడీపీలో చేరారు. శుక్రవారం ఆయన వైసీపీ కన్వీనరు పదవికి రాజీనామా చేసి ఉండవల్లిలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో వై.పాలెం ఇన్‌చార్జ్ గుడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ చేరారు. ఆయనతో పాటు కవలకుంట్ల సర్పంచి భర్త ఆవుల వెంకటరెడ్డి, మానేపల్లి సర్పంచి భర్త చిన్నపురెడ్డి రమణారెడ్డి, ఐటీవరం ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాగులూరి సామ్యేలు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో పాటు వారి అనుచరులు టీడీపీలో చేరారు. మండలంలో మంచి పట్టున్న నేత పార్టీ మారకుండా ఒత్తిడి చేసినప్పటికీ వారు టీడీపీలో చేరడం గమనార్హం. నియోజకవర్గంలో వున్న అసమ్మతితో పాటు, జగన్ పాలన విధానం నచ్చక పోవడంతో ఆయన టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. వీరితో పాటు మండలంలో భారీగా వలసలు వుండే అవకాశం వుంది. రెంటపల్లి చేరికలో వైసీపీ కేడర్ నిరుత్సాహ పడుతోంది. కేడర్ చేజారుతుంది. టీడీపీలోకి వరుసగా వలసలు వస్తున్నాయి. దీంతో టీడీపీ కేడరు జోరుగా ఉంది. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు కేడర్ కసితో పనిచేస్తుండగా, వైసీపీ నుంచి మరిన్ని వలసలు ఉండే అవకాశం ఉంది.



ఇంటర్ పరీక్షలు పూర్తవడంతో ఉత్సాహంగా కేరింతలు కొడుతున్న విద్యార్థినులు (ఇన్‌సెట్లో) హాస్టళ్లలో సామాన్లు సర్దుకొని ఇంటికి వెళుతున్న దృశ్యం

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- కేంద్రాల వద్ద సందడి వాతావరణం
- కేరింతల కొట్టిన విద్యార్థులు

ఒంగోలు(విద్య), మార్చి 15: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు 18,072 మంది హాజరు కావాల్సి ఉండగా 17,011 మంది హాజరుకాగా 1,061 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఒక్క విద్యార్థి కూడా మాల్‌ప్రాక్టీస్ కింద బుక్ కాలేదు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. వారి హడావుడితో కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అలాగే ఆయా కాలేజీ వారు ఏర్పాటు చేసిన బస్సుల్లో వెళుతూ విద్యార్థులు నగరమంతా కేకలతో హోరెత్తించారు. అలాగే పేపర్లు చించి రోడ్లపై చల్లుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు సూట్ కేసులు సర్దుకొని స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

టీచర్ల బదిలీల్లో భారీ ముడుపులు

- రూ.2 కోట్లు చేతులు మారిన వైనం

ఒంగోలు(విద్య), మార్చి 15 : జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు పొందేందుకు కొందరు అధికారులు, దళారులకు ఉపాధ్యాయులు భారీగానే ముడుపులు ముట్టజెప్పారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 98 మంది టీచర్లు రెండు విడతలుగా బదిలీ ఉత్తర్వులు పొందారు. ఈ బదిలీలకు జిల్లాలోని టీచర్లు రూ.2కోట్లకుపైగా దళారులకు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. దళారులకు ముందుగా డబ్బులు ఇచ్చిన కొందరికి తీరా బదిలీ ఉత్తర్వులు రాకపోవడంతో తాము మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సుల లేఖలు పొంది దళారుల ద్వారా పనిచక్కబెట్టుకున్నారు. కొందరైతే అడ్వాన్స్‌గా సగం మొత్తం తీసుకొని మిగిలింది ఉత్తర్వులు వచ్చాక వసూలు చేసుకున్నారు. మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల సిఫార్సు చేసిన వారికి ఉచితంగానే బదిలీ ఉత్తర్వులు రాగా మిగిలిన వారు మాత్రం బదిలీ ఉత్తర్వులకు ఒక్కొక్కరు కనీసం రూ.3లక్షల వరకు చెల్లించినట్లు చెపుతున్నారు. బదిలీ ఉత్తర్వులు పొందిన వారు మే 31న కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. ఎస్‌జీటీలు 40మంది, హైస్కూలు హెచ్ఎంలు ఎనిమిది మంది, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు నలుగురు, స్కూలు అసిస్టెంట్ గణితం 40మంది, పీఎస్ 9, ఇంగ్లీషు 6, తెలుగు 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, బయాజికల్ సైన్స్ 1, హిందీ 6, సోషల్ స్టడీస్ ఇద్దరు బదిలీ ఉత్తర్వులు పొందారు. ఎస్‌జీటీల ఉత్తర్వులు ఎంఈఓలకు, స్కూలు అసిస్టెంట్ ఉత్తర్వులు సంబంధిత హెచ్ఎంలకు శుక్రవారం అందజేశారు.

నేడు మాగుంట టీడీపీలో చేరిక

- ఒంగోలు నుంచి భారీ కాన్వాయ్ ఏర్పాటు
- అనుచరులతో కలిసి ర్యాలీగా బయలుదేరనున్న ఎంపీ



ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనుసరించిన విధానాలతో వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ తన కుమారుడు, యువ పారిశ్రామికవేత్త రాఘవరెడ్డితో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. జిల్లావ్యాప్తంగా మాగుంటకు పెద్దఎత్తున అనుచరులు, అభిమానులు ఉన్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో అభిమానులు టీడీపీలో చేరగా మాగుంట వెంట నడిచే ముఖ్య అనుచరులు ఆయనతో పాటు టీడీపీలో చేరనున్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయం నుంచి ఉండవల్లి బయలుదేరనున్నారు. 250కిపైగా వాహనాలను ఏర్పాటుచేశారు. భారీ సంఖ్యలో మాగుంట అనుచరులు, అభిమానులు టీడీపీలో చేరుతుండటంతో వైసీపీలో అలజడి నెలకొంది.

వాహనదారులకు స్వల్ప ఊరట

- డీజిల్, పెట్రోలు లీటరుకు రూ.2 తగ్గింపు



ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం వాహనదారులకు స్వల్ప ఊరట కలిగించింది. పెట్రోలు, డీజిల్‌కు లీటరకు రూ.2 తగ్గించింది. నిన్నటి వరకు డీజిల్ లీటర్ రూ.98.54 ఉండగా పెట్రోలు రూ.110.72 ఉంది. కేంద్రప్రభుత్వం తగ్గించిన ధరలు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. శుక్రవారం ఒంగోలులో డీజిల్ లీటరు రూ.96.54 ఉండగా, పెట్రోలు రూ.108.72 ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొంతమేర వినియోగదారులకు ఊరట కలిగింది.

బాలినేని ఇంట బహుమతుల సందడి..!

- మెప్మా, అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో సమావేశం
- వైసీపీ కోసం పనిచేస్తే విలువైన బహుమతులు ఇస్తాం

మెయిన్ లో

పది పరీక్షలకు ఫోన్ తెస్తే సస్పెన్షన్

- ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పరీక్ష జరిగే రోజుల్లో ఇతర తరగతులకు సెలవు

ఒంగోలు(విద్య), మార్చి 15 : జిల్లాలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. జిల్లాలో 170 కేంద్రాలను అధికారులు నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించారు. పరీక్షలు నిర్వహించే చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, స్క్వాడ్‌తో సహా ఇతర అధికారులందరికి నిబంధనలు వర్తిస్తాయి. ఎవరూ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకరాకూడదు. ఇక తనిఖీలకు వచ్చే అధికారులు, పోలీసులు, కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం తమ మొబైల్ ఫోన్లను కేంద్రాల బయటపెట్టి తనిఖీలకు వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా సిబ్బంది సెల్‌ఫోన్లను కేంద్రాలకు తీసుకెళ్తే వారిని సస్పెండ్ చేస్తారు. ప్రశ్నపత్రం లీకేజీకి పాల్పడితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తారు.

ఆరు కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన ఆరింటిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ ఆరు కేంద్రాలకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిఘా నీడలో పరీక్షలు నిర్వహించనున్నారు. పిటికాయగుళ్ల, పైడిపాడు, సీఎస్‌పురం, యాచవరం, రాచర్ల జడ్పీ హైస్కూలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది కొమరోలులో కిటికీ ద్వారా ప్రశ్నపత్రం బయటకు వచ్చింది. జవాబులు జిరాక్స్‌లు తీసి విద్యార్థులకు అందజేశారు. సీఎస్‌పురం పరీక్షా కేంద్రంలో గుట్టలుగా కాపీలు దొరికాయి. పిటికాయగుళ్ల, పైడిపాడు పరీక్షా కేంద్రాలు ఎప్పటినుంచో మాస్ కాపీయింగ్‌కు పేరుగాంచాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఈ కేంద్రాలకు ప్రత్యేకంగా పోలీస్ నిఘా కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పరీక్ష రోజుల్లో పాఠశాలలకు సెలవు

పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లోని ఇతర తరగతులకు పరీక్షలు జరిగినన్ని రోజులు సెలవు ప్రకటించారు. కొన్ని కేంద్రాల్లో ఉదయం రెగ్యులర్ పదవ తరగతి, మధ్యాహ్నం ఓపెన్ స్కూలు సొసైటీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇతర తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరిగే రోజుల్లో సెలవులు ప్రకటించారు. పరీక్షలు ముగిసిన అనంతరం వారికి ఆదివారాలతో సహా ప్రభుత్వ సెలవుదినాల్లో ఆ విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

18 నుంచి ఒంటిపూట బడులు

ఒంగోలు(విద్య), మార్చి 15 : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలన్నింటిలో ఈనెల 18 నుంచి విద్యార్థులకు ఉదయం ఒక్కపూటే తరగతులు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు ఒంటిపూట బడులు నిర్వహించే టప్పుడు పాఠశాలల్లో వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. 12.30 గంటలలోపు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి పంపించాలి. స్థానిక దాతల సహకారంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మజ్జిగ సరఫరా చేయాలని కమిషనర్ సూచించారు.

నేడు మోగనున్న ఎన్నికల నగారా

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌పై సీఈసీ స్పష్టత
- ఎనిమిది సెగ్మెంట్లు, 17,99,706 మంది ఓటర్లు, 2,183 పోలింగ్ కేంద్రాలు
- ఇప్పటికే పలు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం



ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నగరా శనివారం మోగనుంది. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) స్పష్టత ఇచ్చింది. దీంతో ప్రజానీకం ప్రత్యేకించి రాజకీయవర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది. వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలన్న బలమైన ఆకాంక్ష అనేక వర్గాల ప్రజల్లో బలంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఈ విడత ఎన్నికలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. జిల్లాల విభజన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు కూడా ఇవేకానున్నాయి. గతంలో జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా మూడు పార్లమెంట్ స్థానాల్లో అవి అంతర్భాంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉండగా అందులో ఏడు ఒంగోలు పార్లమెంట్‌లోనూ, మరొకటి బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉంది.

మహిళా ఓటర్లే అధికం

కాగా జిల్లాలోని ప్రస్తుత ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఈ ఏడాది జనవరిలో అధికార యంత్రాంగం ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలే అధికంగా ఉన్నారు మొత్తం 9,02,749 మంది మహిళా ఓటర్లు ఉండగా 8,96,859 మంది పురుషులు, 98 మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం ఓటర్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారు 36996 మంది కాగా సర్వీసు ఓటర్లు 6815 మంది ఉన్నారు. అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో 2,37,079మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,05,300 మంది ఉన్నారు. ఇక ఎనిమిది నియోజకవర్గాల్లో మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

యంత్రాంగం విస్తృత కసరత్తు

ఇదిలా ఉండగా జిల్లా యంత్రాంగం గత మూడు నెలలుగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై విస్తృత కసరత్తు చేసింది. కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ నేతృత్వంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణలో కీలకమైన రెవెన్యూ పోలీస్ యంత్రాంగం పూర్తిగా ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ మొదలు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చేర్పులు, మార్పులు, ఈవీఎంల పరిశీలన, కౌంటింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ సిబ్బంది గుర్తింపు తదితరాలు పూర్తిచేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు కలెక్టర్ దినేష్‌కుమార్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తుండగా అసెంబ్లీ సెగ్మెంట్లకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు రిటర్నింగ్ అధికారులుగా నియమితులయ్యారు. వారి పర్యవేక్షణలో అటు జిల్లా ఇటు నియోజకవర్గ స్థాయిలో అన్ని ఏర్పాట్లు, రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాగా శనివారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రానుండగా ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తోంది. కోడ్ అమలుకు కూడా అధికారులు చర్యలు చేపట్టారు.

పల్లె ప్రగతి టీడీపీతోనే సాధ్యం : బీఎన్



కరపత్రాలను పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, మార్చి 15 : పల్లె ప్రగతి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కూనంనేనివారిపాలెంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ ఇంటింటా తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలు కోసం తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం లాంటి పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయన్నారు. చంద్రబాబునాయుడు సీఎం అయితే రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, నల్లూరి వెంకటసుబ్బయ్య, పుట్టా బ్రహ్మయ్య, యర్రగుంట్ల శ్రీను, పమిడి హరిబాబు, సర్పంచ్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఖర్చు విధివిధానాలపై

అవగాహన ఉండాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు విధివిధానాలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి ప్రచారానికి సంబంధించిన సమావేశాలు, ర్యాలీలకు సంబంధించి ఖర్చు పెట్టే వస్తువులు, సామగ్రి, పరికరాలపై ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన రేటు కార్డు ప్రతులను రాజకీయ పార్టీలకు అందజేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల క్లైయిమ్స్‌లు సుమారు 4వేలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో తొలగింపులు సాధ్యపడవని స్పష్టం చేశారు. కేవలం చేర్పులకు మాత్రమే అవకాశం ఉంటుందని, ఆ లోపుగా అలాంటి తొలగింపులు ఏమైనా ఉంటే సరి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై, నామినేషన్ పత్రాల సమర్పణపై అవగాహన కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో నగర కమిషనర్ జశ్వంతరావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ దేవదానం, రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రాంతికుమార్, స్వరూప్, రసూల్ బాషా, రఘురాం, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలోనే పేదలకు మేలు

• ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: వైసీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని ఎమ్మె ల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొ న్నారు. స్థానిక సమైక్యనగర్‌లో రూ. 40లక్షల వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీహాలు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీహాలు నిర్మాణంతో పాటు రోడ్లు, సైడు కాలువలు నిర్మిస్తామన్నారు. జిల్లా చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒంగోలు నగరంలో వేలాది మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బెతంశెట్టి శైలజ, హరిబాబు, నగర అధ్యక్షుడు కటారి శంకర్, గంటా రామానాయుడు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, డివిజన్ అధ్యక్షుడు సత్యనారాయణ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో సృజన-2కే24 ఫెస్ట్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు(విద్య), మార్చి 15: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సృజన-2కే24 టెక్నికల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 1500 మంది విద్యార్థులు హాజరై పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్, ప్రాజెక్టు ఎక్స్‌పో తదితర పోటీల్లో సత్తా చాటారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ టెక్నికల్ ఫెస్ట్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, ఏవో రమణబాబు, డీన్ కె.రూప ఆక్వేష్, ఆర్.వీరాంజనేయులు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15 : త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా స్వీప్ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులో మెప్మా, ఎస్‌బీఐ లైఫ్‌మిత్రలకు ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు డాక్టర్ బి.రవి, వీఎస్.జ్యోతి, మెప్మా పీడీ రవికుమార్, ఎస్‌బీఐ లైఫ్ డివిజనల్ రీజనల్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

నేను చేసిన అభివృద్ధిని పుస్తకరూపంలో వివరిస్తా...

మీరు కనీసం కరపత్రమైనా చూపండి..!

ఎమ్మెల్యే బాలినేనికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల సవాల్ • 21వ డివిజన్‌కు చెందిన పలువురు టీడీపీలో చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్, రియాజ్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 15 : "నేను చేసిన అభివృద్ధిని పుస్తక రూపంలో ప్రతి ఇంటికీ చేరుస్తా. మీ పదవీకాలంలో నాలుగున్నరవేల కోట్ల రూపాయలతో ఒంగోలు నగర అభివృద్ధి చేశానంటూ చెబుతున్నావ్.. అదే నిజమైతే కనీసం మీరు చేసిన అభివృద్ధిపై కరపత్రమైనా ప్రజల ముందుకు తీసుకురాగలరా..?" అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి సవాల్ విసిరారు. శుక్రవారం నగరంలోని 21వ డివిజన్‌లోని వైసీపీకి చెందిన న్యాయవాది గాలి శ్రీకాంత్ తన మిత్రులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక ఎన్జీవోహోం సమీపంలోని శ్రీకాంత్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి దామచర్ల జనార్దన్, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దామచర్ల మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలినేని పదేపదే అబద్ధాలు చెబితే నిజాలు అవుతాయన్న భ్రమలో ఉన్నారన్నారు. దోచుకున్న డబ్బులతో చీరలు, ప్యాంటులు పంచితే ఓట్లు వస్తాయని అనుకోవడం అవివేకమని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను చేసిన అభివృద్ధి గురించి ప్రజల ముందు చెప్పడానికి ఎప్పుడైనా సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే అభివృద్ధిపై పుస్తకం ముద్రించి ప్రతి ఇంటికీ చేరుస్తున్నానని తెలిపారు. మరి బాలినేనికి చేతనైతే ఇప్పటి వరకు నగర అభివృద్ధి కోసం ఏమీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. "ప్రజలకు ఏమి చేయలేకపోయాను. ఒక్కసారి చివరి అవకాశం ఇస్తే ఇప్పటికైనా అభివృద్ధి చేస్తానని చెప్పుకుంటే బాగుంటుందని" దామచర్ల హితవు పలికారు. అంతేగాని అబద్ధాలతో ప్రజలను మోసం చేయాలని చూస్తే ప్రజలు అమాయకులు కాదన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, అందుకే అభివృద్ధి చేసే పార్టీ టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. అనంతరం రియాజ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా దామచర్ల జనార్దన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అబద్ధాలు చెప్పే వైసీపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వైసీపీకి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ మెర్సీకుమారి, మద్దెల శివసాయి, మెట్ల రామకృష్ణ, పాలేటి రాజారావు, పల్లె ప్రశాంత్, మరో 100మంది వైసీపీ సానుభూతిపరులు తెలుగుదేశం పార్టీలో చేరగా, దామచర్ల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు చలపతి, మురళీకృష్ణ, చావలి సుధీర్, జనసేన నాయకులు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి

జడ్.మేకపాడు సభలో ఎమ్మెల్యే స్వామి, సత్య • వైసీపీని వీడి టీడీపీలో చేరిన 15 కుటుంబాలు



ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

పొన్నలూరు, మార్చి15: రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని జడ్.మేకపాడు గ్రామంలో వైసీపీని వీడి 15 కుటుంబాల వారు కొండపి ఎమ్మెల్యే స్వామి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా జరిగిన సభలో స్వామి మాట్లాడుతూ రాష్ట్రం వైసీపీ పాలనలో సర్వనాశనం అయ్యిందని విమర్శించారు. టీడీపీ హయాంలో జడ్. మేకపాడు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేసిన నిధులను తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని విమర్శించారు. దామచర్ల సత్య మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడాలని రాష్ట్ర ప్రజలు ఆకాంక్షించారన్నారు. ప్రజల కుదిర్చిన పొత్తుతో వైసీపీ చిత్తుగా రాబోయే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామని స్వామి, సత్య హామీనిచ్చారు. పార్టీ కండువాలు వేసి స్వాగతం పలికారు. సమావేశానికి ముందుగా స్వామి, సత్యలకు గ్రామస్థులకు భారీగా స్వాగతం పలికారు. మేళతాళాలతో, బాణసంచా కాల్చి ఊరేగింపు నిర్వహించారు. గ్రామ తెలుగుయువత నాయకుడు కాటూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ కాటూరి వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఉపసర్పంచ్ పాపినేని ప్రసాద్, కాటూరి సుబ్బారావు, కాటూరి లక్ష్మీనారాయణ, కాటూరి వెంకటేశ్వర్లు, కాటూరి గురవయ్య ప్రసాద్, మాల్యాద్రి మరికొన్ని కుటుంబాలవారు చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాంబశివరావు, నాయకులు ఉమండవ ప్రసాద్, కర్రా కోటిరెడ్డి, పిల్లి వెంకటనారాయణరెడ్డి, సన్నమూరి నరసింహారావు, కాటూరి మాధవరావు, ఉన్నం బసవయ్య పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయాలి

• ఎమ్మెల్యే స్వామి



కొండపిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి, నాయకులు

కొండపి, మార్చి15: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి ఈనెల 17వ తేదీన టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు ప్రజలు భారీగా హాజరు కావాలని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం కొండపిలోని పార్టీ కార్యాలయంలో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికోసం మూడు పార్టీలు కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో జరుగుతున్న సభ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించనున్నదని స్వామి అన్నారు. జనసేన కొండపి నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాగళం సభకు భారీగా తమ పార్టీ తరుపున జనాన్ని సమీకరిస్తున్నామని తెలిపారు. ప్రజాగళం కార్యక్రమ మండల పరిశీలకుడు వల్లపనేని చినసుబ్బారావు మాట్లాడుతూ భారీగా జనసమీకరణ చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకుడు బాలకోటయ్య మాట్లాడుతూ మూడు పార్టీల ఉమ్మడి పొత్తుద్వారానే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరుతాయన్నారు. సమావేశంలో జనసేన మండల అధ్యక్షుడు యనమద్ని విశ్వం, టీడీపీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, మండల అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, కొర్రపాటి వసంతరాయుడు, మూలె కోటేశ్వరరావు, నన్నూరి సుబ్బరామయ్య, తెలుగు యువత మండల అధ్యక్షుడు షేక్ ఖాజుషా పాల్గొన్నారు.

నాయకులతో బీఎన్ భేటీ

సంతనూతలపాడు: చిలుకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో ఈనెల 17న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో ఆయన మండలనాయకులతో భేటీ అయ్యారు. బహిరంగసభకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌట శ్రీనివాసరావు, ప్రోగ్రాం పరిశీలకులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు ముప్పవరపు వీరయ్యచౌదరి, మండవ జయంత్‌బాబు, గొట్టిపాటి రాఘవరావు, తేళ్ల మనోజ్, కేఎల్.వరప్రసాద్, ఎ.శేషయ్య, వి.శ్రీనివాసరావు, ఎం.గోపి, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడిలో ఈనెల 17న జరుగనున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రజాగళం సభను విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం టంగుటూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కలయిక తరువాత జరుగుతున్న తొలి సభ ద్వారా తమ సత్తా చాటాలన్నారు. పైగా సభలో ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన జాతీయ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పాల్గొంటున్నందున మూడు పార్టీల కార్యకర్తలు జన సమీకరణను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ సభ విజయవంతంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు బెల్లం కోటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పార్టీ పరిశీలకుడు రామయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయకుమార్

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

• టీడీపీ, జనసేన నాయకుల డిమాండ్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

నాగులుప్పలపాడు, మార్చి 15: పంచాయతీ నిధులను స్వాహ చేసిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ, జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఉప్పుగుండూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం వారు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన శ్రీరామమూర్తి అక్రమ మార్గాల్లో రూ.42 లక్షలు పంచాయతీ నిధులను స్వాహ చేశారని, అయితే నెలలు గడుస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయకూడదనే నిబంధన ఉన్నా శ్రీరామమూర్తిని బదిలీ చేయడం వెనుక ఉన్నతాధికారుల పాత్ర ఉందని ఆరోపించారు రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి నిబంధనలకు పాతరేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే పలుమార్లు స్పందనలో వినతిపత్రాలు అందించినా చర్యలు తీసుకునేందుకు జిల్లా పంచాయతీ అధికారి సైతం వెనుకాడటం వెనుక ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అవినీతికి పాల్పడిన కార్యదర్శిని సస్పెండ్ చేసి స్వాహా చేసిన రూ.42 లక్షలను తిరిగి పంచాయతీకి జమ చేసేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కనగాల శ్రీనివాసరావు, పోట్లూరి నాగమల్లేశరరావు, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య, పెంట్యాల కోటేశ్వరరావు, బాలిశెట్టి నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీకాంత్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలు చూసి వస్తువులు కొనుగోలు చేయొద్దు : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15 : వివిధ మాధ్యమాల్లో వచ్చే వాణిజ్య ప్రకటనల ఆధారంగా వస్తువులను కొనుగోలు చేయకూడదని జేసీ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ సభ జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి ఉదయభాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జేసీ మాట్లాడుతూ నాణ్యమైన సేవలు వినియోగదారుల హక్కు అన్నారు. విలువైన వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు నలుగురిని సంప్రదిస్తే మంచిదని చెప్పారు. కరోనా తర్వాత ఆన్‌లైన్ ద్వారా వ్యాపార లావాదేవీలు పెరిగాయని, ఇదే అదునుగా కొత్త రకం మోసాలకు సైబర్ నేరగాళ్ళు తెర తీస్తున్నారని, దీనివల్ల సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన లేని వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వినియోదారుల పాత్ర కీలకమన్నారు. తయారయ్యే వస్తువులు వినియోగదారులు వాడకుంటే ఉత్పత్తిదారులకు ప్రేరణ ఉండదని స్పష్టం చేశారు. జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యురాలు సమీరా మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలు, వారి హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు దేశంలో ప్రతి ఏటా డిసెంబరు 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. వినియోగదారుల రక్షణ చట్టం 1986లో రాష్ట్రపతి ఆమోదం పొంది అమలులోకి వచ్చిందన్నారు. అందువల్ల వినియోగదారులు ఈ చట్టంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం జిల్లా వినియోగదారుల ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తున్న నరసింహులు, వీరారెడ్డి, అంజయ్య, తిరుమల, రాధాకృష్ణ, నాగేంద్ర, లక్ష్మీపార్వతిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవికుమార్, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రవికుమార్, కార్యదర్శి ఏనుగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు కళాశాలలకు చెల్లించాలి

ఒంగోలు నగరం, మార్చి 15: జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకం కింద ప్రభుత్వం విడుదల చేసిన ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులను తల్లులు డ్రా చేసి తమ పిల్లలు చదువుతున్న కళాశాలలకు జమ చేయాలని జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమం, సాధికారిత అధికారిలక్ష్మానాయక్ కోరారు. శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇతర సంక్షేమశాఖల అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఫీజు రీ ఎంబర్స్‌మెంటు నిధులు 2022 డిసెంబర్ మాసంలో విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేసిందని, ఈ నిధులను తల్లులు డ్రా చేసి కళాశాలకు జమ చేయాల్సి ఉండగా ఎక్కువ మంది ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఈ నిధులను వెంటనే ఆయా కళాశాలల ఖాతాలకు జమ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫీజులు కళాశాలలకు జమ చేయని వారి వివరాలు అందుబాటులో ఉంచామన్నారు. తల్లులతో ఈ నిధులను కళాశాలల ఖాతాలకు జమ చేయించి ఆ రశీదును నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

బొప్పూడి సభకు బీజేపీ శ్రేణులు తరలిరావాలి



మాట్లాడుతున్న యోగయ్యాయాదవ్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15 : ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద జరిగే బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీగా తరలిరావాలని ఆ పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యాయాదవ్ కోరారు. స్థానిక బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లు పాల్గొంటారన్నారు. ఆరోజు ఉదయం ఒంగోలులోని బీజేపీ జిల్లా ఎన్నికల కార్యాలయం నుంచి బస్సులు బయలు దేరుతాయన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, సీతారామయ్య, మోజే, కాటా రాధాకృష్ణమూర్తి, పి.తిరుమల, కె.సుధాకర్, సింగోతు రాజేష్, హరికృష్ణ, అనిల్, పెట్లూరి ప్రసాదరావు, దనిశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

ఒంగోలు(కల్చరల్), మార్చి 15 : పవిత్రమైన రంజాన్ మాసంలో తమ శక్తిమేరకు సమాజంలోని పేదలకు అన్నదానం చేయడం ఎంతో విశిష్టమైందని హైదరాబాద్‌కు చెందిన పీస్ మేసేజ్ ఫౌండేషన్ నిర్వహకులు శిరాజ్ ఫుర్ రెహమాన్ పేర్కొన్నారు. రంజాన్ మాస తొలి శుక్రవారం సందర్భంగా షేక్ రషీద్ ఆధ్వర్యంలో శుక్రవారం శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతపేటలోని అనాథ శరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు, ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ మహబూబ్, శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, కోసూరి సుజాత, రామయ్య చౌదరి, ఒంగోలు మురళీకృష్ణ, నాగాంజనేయులు, శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకపత్రాల అందజేత

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15 : జిల్లా ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పటల్స్‌లో పనిచేసేందుకు 17 మంది ఆరోగ్య మిత్రలు, ఇద్దరు టీం లీడర్లను నియమిస్తూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. అర్హత కలిగిన అభ్యర్థుల డిగ్రీ మార్కులు, కంప్యూటర్ నైపుణ్య పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమించినట్లు ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ తెలిపారు.

నేడు కాపు వృద్ధాశ్రమానికి శంకుస్థాపన

ఒంగోలు(కల్చరల్) మార్చి 15: కాపు కుల వృద్ధుల కోసం ఒంగోలు నగరంలో నిర్మించనున్న వృద్ధాశ్రమానికి శనివారం ఉదయం 11.30 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని ఆశ్రమ కమిటీఅధ్యక్షులు గాదె వెంకట కృష్ణారావు, జనరల్ సెక్రటరీ చాకిరి ధనుంజయ్, కోశాధికారి బేతంశెట్టి హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భాగ్యనగర్ 4వ లైనులో వృద్ధాశ్రమానికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత చేతులమీదుగా భూమి పూజ జరుగుతుందన్నారు. కాపు వృద్ధాశ్రమ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన నగర కార్పొరేషన్, రాష్ట్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నగరానికి చెందిన కార్పొరేటర్లు, కాపు సంఘాల నాయకులు, పాల్గొనాలని కోరారు.

పలు భవనాలను ప్రారంభించిన మంత్రి

సంతనూతలపాడు, మార్చి 15: సంతనూతలపాడులో శుక్రవారం నూతనంగా నిర్మించిన పలు నూతన భవనాలను మంత్రి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ నాగార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండోర్‌స్టేడియం, సిండికేట్ రైతు సేవా సహకార సంఘం నూతనభవనం, ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్మించిన మండలవ్యవసాయకేంద్రం, పశువైద్యశాల ముఖద్వారం తదితర భవనాలను మంత్రి రిబ్బన్ కట్‌చేసిన ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో వైఎస్సార్ చేయూత పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, జడ్పీటీసీ డి.రమణమ్మ, సర్పంచ్ డి.నాగమణి, నాయకులు సొసైటీ ఛైర్మన్ డి.యలమందారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బంగారుబాబు, మండల వైసీపీ కన్వీనర్ డి.చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బాధ్యతరాహిత్యం తగదు

మద్దిపాడు, మార్చి 15: తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అంగనవాడీల ఉద్యోగోన్నతి చూద్దామనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలంసుబ్బారావు అన్నారు. ఈమేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయాలకు ఉద్యోగోన్నతి ఇవ్వాలని కోర్టు తీర్పు ఇచ్చినా అధికారులు చోద్యం చూస్తున్నారని, ఈ విషయం మంత్రి మేరుగ నాగార్జునను బాధితురాలు యూనియన్ నాయకులు కలిసి విన్నవించగా తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత చూద్దామనడం ఎంతవరకు సమంజసమో చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన అంగన్‌వాడీ ఆయాలకు ఉద్యోగోన్నతి వచ్చే వరకు సీఐటీయూ అండగా ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

టంగుటూరు, మార్చి 15 : ముందు వెళ్తున్న చాపల లోడు లారీ సడన్‌గా స్పీడు తగ్గిపోవడంతో దాన్ని తప్పించే ప్రయత్నంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన వ్యాను ఢీకొట్టింది. వల్లూరు సమీపంలోని ఢిల్లీ హైవే హోటల్ దాటగానే ఈప్రమాదం జరిగింది. గురువారం రాత్రి జరిగిన ఈప్రమాద సంఘటనలో వ్యాను డ్రైవర్ (ఒంగోలు మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన షేక్ కబురుద్దీన్) అక్కడికక్కడే మృతి చెందారు. పక్కన కూర్చున్న ఒంగోలు వెంకటేశ్వర కాలనీకి చెందిన మాదాల బాలాజీ తీవ్రంగా గాయపడ్డారు. వ్యానులోని వీరు కందుకూరు నుంచి ఒంగోలు వెళ్తుండగా ఈప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలాజీని వెంటనే 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చనిపోయి వ్యానులో ఇరుక్కుపోయిన కబురుద్దీన్ మృతదేహాన్ని వ్యాను నుంచి వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

పుస్తకాలు, పెన్నుల పంపిణీ

సింగరాయకొండ, మార్చి 15: పంచాయతీ పరిధిలోని స్మార్ట్‌జెన్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి తాతయ్య గిరిజన కాలనీలోని చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్. డాక్టర్ గీతారాణి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి విద్యను అభ్యసించాలని సూచించారు. గిరిజన కాలనీలో విద్యార్థులకు చదువుకు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కాలనీలో ముున్ముందు పలు రకాల సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి స్పెల్‌బీ పోటీలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: ఒంగోలు నగరం దారావారితోటలోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి స్పెల్ బి పోటీలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లాలోని నారాయణ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం పెద్దిరెడ్డి, సాఫ్ట్ స్కిల్స్ హెచ్‌వోడీ సాధిక్, ఆర్‌అండ్‌డీహెచ్ రాజేష్, కో ఆర్డినేటర్ శరత్‌బాబు, ఆర్ఐ మన్నం శ్రీనివాసులు, క్లస్టర్ ప్రిన్సిపాల్స్ వేదవతి, సయ్యద్ నాగూర్‌వలి, ఈ చాంప్స్ హెడ్ అభిషేకం, ఈకిడ్స్ హెడ్ ప్రమీల పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ఒంగోలు(కల్చరల్), మార్చి 15 : సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్టు సెక్రటరీ షేక్ సర్దార్‌బాషా ఆధ్వర్యంలో దివ్యాంగురాలు సుమలతకు జీవనోపాధి కోసం ప్రవాస భారతీయుడు తేజ రావెళ అన్న కుమార్తె రావెళ రుత్విక మొదటి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌షా చేతుల మీదుగా రూ.60వేల నగదు అందించారు. సుమలత భర్త చనిపోయి ఇద్దరు చిన్న బిడ్డలతో ఇబ్బందులు పడుతుండగా సహాయం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు శ్రీనివాసరావు, ట్రస్టుసభ్యులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ
ప్రజాగళం బహిరంగ సభకు
రండి.. కదలిరండి.. తరలిరండి..
యువత భవిత కోసం, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం..
మార్పుకై సాగుతున్న మహా సంగ్రామ పోరాటంలో
మీరు భాగం అవ్వండి.
తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి
బహిరంగ సభకు భారీ ఎత్తున హాజరై
విజయవంతం చేయండి.
తేదీ:17-03-2024
ఆదివారం రోజున
బొప్పూడి, చిలకలూరిపేట
మధ్యాహ్నం 4 గంటలకు
బాబు ష్యూరిటీ
సంక్షేమం
అభివృద్ధి
భవిష్యత్తు గ్యారెంటీ
తెలుగుదేశం పార్టీ
సైకిల్ గుర్తుకే మన ఓటు
సవరపు ప్రసాద్ బాబు
బాపట్ల పార్లమెంట్ తెలుగు దేశం నాయకులు
జై తెలుగుదేశం.. జై చంద్రబాబు..

టీడీపీ గెలుపుతోనే అభివృద్ధి

- వై.పాలెం నియోజకవర్గ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు
- గిద్దలూరులో ముత్తుముల సమక్షంలో భారీగా చేరికలు



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, మార్చి 15: రాష్ట్రంలో నియోజకవర్గంలో టీడీపీ విజయంతోనే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని ఐనముక్కల గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన వైసీపీ నాయకులు ఇటీవల టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో ఎరిక్షన్‌బాబు విజయాన్నికాంక్షిస్తూ వారు శ్రీశైలానికి పాదయాత్రను తలపెట్టారు. ఈ క్రమంలో స్థానిక నటరాజ్ కూడలి వద్ద పాదయాత్రను గూడూరి ఎరిక్షన్‌బాబు శుక్రవారం టీడీపీ జెండా ఊపి ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయంలో, గణపతి దేవాలయంలో కొబ్బరికాయ కొట్టి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లగా నియోజకవర్గంలో గ్రామాలన్నింటిలో పలు మార్లు పర్యటించానని సమస్యలు తెలుసుకున్నానన్నారు. అందరి తో మమేకమై నియోజకవర్గం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై అవగతమయిందన్నారు. ప్రజలు కూడా పార్టీలకతీతంగా తనను అభిమానిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సమన్వయంతో పాటు అందరి ఆశిస్సులతో అధిక మెజారిటీతో గెలుస్తాన న్నారు. తన విజయం కోసం శ్రీశై లానికి పాదయాత్రను చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. పాదయాత్రగా బయలుదేరిన నీరూరి మోజెస్, చిన్న వెంకటేశ్వర్లు, చెన్నయ్య, తప్పెట్ల త్రినాథ్, మట్టుపల్లి సుధాకర్, కాటి వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు 15 మందిని ఆయన అభినందించారు. సైకిలు గుర్తుపై ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్‌మాబు, దొడ్డా శేషా ద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, షేక్ భాష, షేక్ ఇస్మాయిల్, చల్లా వెంకటేశ్వర్లు, ఎలకపాటి చంచయ్య, షేక్ మంజూర్ భాష, కొప్పుల సుబ్బారెడ్డి, కటికల శ్రీనివాసులు, కే రాజేంద్ర, జనసేన నాయకులు మురళి, ప్రసాద్, బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

చేరికలతో నూతనోత్తేజం

గిద్దలూరు టౌన్ : టీడీపీలోనికి చేరికలతో ఆ పార్టీ కేడర్ నూతనోత్తేజంతో ముందుకు పోతోంది. శుక్రవారం అర్థవీడు పంచాయతీలోని 25 చెంచు కుటుంబాలు మండల బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లాకా రమణ యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరాయి. వారికి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నాగుల కొండమ్మ, నాగుల రాజు, దాసరి పెద్దక్క, ఉడుముల కొండయ్య, దాసరి గంగయ్య, గుర్రమ్మ, దాసరి లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, దాసరి కొండయ్య, నాగుల వీరయ్య, గురువ య్య, దాసరి మూగయ్య తదితరులు చేరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్, మండల పరిశీలకులు అంబవరపు శ్రీనివాసరెడ్డి, కోసంగి శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పలుగుంటిపల్లి పది కుటుంబాలు చేరిక

రాచర్ల మండలం పలుగుంటిపల్లి గ్రామానికి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరాయి. టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బొమ్మని మహేశ్వర్‌రెడ్డి, గజ్జా వెంకటేశ్వర్లు, ఇప్పాల బాలిరెడ్డి, గాడిదమల్ల బాబు, దూదేకుల తంగెళ్లు, మోతుకూరి పాండురంగస్వామి, మోతుకూరి రమేష్, కంచర్ల శేఖర్‌గౌడ్, కాపు నాయకులు యల్లా నాగరాజు, యల్లా మహేష్, మండలపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, గోపిరెడ్డి జీవనేశ్వర్‌రెడ్డి, తాహేర్‌భాషా, మాధవ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన చెంచు కుటుంబాలతో ముత్తుముల

కాకర్ల ఉపసర్పంచ్ చేరిక

అర్థవీడు మండలం కాకర్ల గ్రామానికి చెందిన వైసీపీ వైస్‌సర్పంచ్ కాకర్ల రాజశేఖర్‌తోపాటు 5వ వార్డు సభ్యుడు కొండా రామలింగారెడ్డి, ఎడమకంటి సుబ్బారావు, మాజీ సర్పంచ్ కోటపాటి వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరువ సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పి.దివాకర్ వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అశోక్‌రెడ్డి గెలుపు కోసం తామంతా కృషి చేస్తామని తెలిపారు.

అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలి

యూటీఎఫ్ డివిజన్ జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు

పొదిలి, మార్చి 15 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్రమ బదిలీలను తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డివిజన్ జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక విద్యా వనరులు కేంద్రం ఆవరణలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 1200లకు పైగా అక్రమ బదిలీలు జరిగాయన్నారు. కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టి అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై, మండల అధ్యక్షులు సత్యనారా యణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బాలకాశిరెడ్డి, తిరుపతిరెడ్డి. బజ్జి బాబు, కృపారావు, శివారెడ్డి, ఓబులరెడ్డి, సురేష్, సుబ్రహ్మణ్యాచారి, రవీంద్రబాబు, నారాయణరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

రోగులు కోలుకునే వరకూ వైద్య శిబిరం

ముండ్లమూరు, మార్చి 15 : మండలంలోని నాయుడుపాలెంలో చికున్ గున్యా వ్యాధితో బాధపడుతున్న రోగులు కోలుకునేవరకూ వైద్య శిబిరం కొనసాగుతుందని ఒంగోలు డివిజన్ డీఎల్‌పీవో రాధా అన్నారు. ఆమె శుక్రవారం మండలంలోని నాయుడుపాలెం గ్రామాన్ని సందర్శించారు. ముందుగా వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, మధు శంకర్‌తో మాట్లాడారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా వీధుల్లో బ్లీచింగ్, ఎబేట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. దర్శి సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న ఎన్‌ఏపీ నీరును గ్రామస్థులు కాచి చల్లార్చుకొని తాగే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రానున్న వేసవి కాలాన్నీ దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ శ్రీ దేవి, పంచాయతీ కార్యదర్శి కే సురేష్‌రెడ్డి, సర్పంచ్ గొర్రె శ్రీదేవి, రాముడు ఉన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.5కోట్లు మంజూరు

- ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి

కనిగిరి, మార్చి 15: కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.5కోట్లు మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే ఉషారాణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పీఎం ఉషా (ప్రధానమంత్రి ఉన్నత విద్యా పథకం) కింద రూ.5కోట్ల గ్రాంట్ విడుదలైనట్లు తెలిపారు. ఆయా నిధులతో కళాశాలలోని మరిన్ని తరగతి గదులు, టాయిలెట్స్, ప్రహరి, హాస్టల్ ఆడిటోరియం, రన్నింగ్‌ట్రాక్ నిర్మిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రకాశంజిల్లాలో ఈ పథకానికి అర్హత పొందిన ఏకైక కళాశాల అని ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళా కండక్టర్‌పై యువకుడి దాడి

పొదిలి, మార్చి 15 : పొదిలి ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా కండక్టర్‌పై యువకుడు దాడిచేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పొదిలి కనిగిరి బస్సులో కనిగిరిని నుంచి వచ్చిన యువకుడు పూటుగా మద్యం సేవించి ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. బస్సు పొదిలికి చేరుకున్న తరువాత కూడా బస్సు దిగకపోవడంతో కండక్టర్ పొదిలి వచ్చింది దిగాలని కోరింది. దీంతో ఆగ్రహించిన యువకుడు మహిళా కండెక్టర్‌ను దర్భాషలాడుతూ దాడికి దిగాడని ఆమె పేర్కొన్నారు. బస్సులో ప్రయాణీకులు, ఆర్టీసీ సిబ్బంది యువకుడికి దేహశుద్ధి చేసి పోలీస్‌లకు అప్పగించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

పుల్లలచెరువు,మార్చి 15: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వేకువజామున మండలంలోని చేపలమడుగులో చోటుచేసుకొంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పామూరుకు చెందిన లక్ష్మీప్రసన్నను మండలంలోని చాపలమడుగులోని మిరియాల వెంకటేశ్వర్లుకు ఇచ్చి గతేడాది వివాహం చేశారు. కుటుంబ కలహాల నేపథ్యంలో లక్ష్మీప్రసన్న(28) శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న పుల్లలచెరువు ఎస్సై ఎండీ ఫిరోజ్ ఫాతిమా ఘటన స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మీ ప్రసన్న తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

200 మందిపై బైండోవర్ కేసులు

దొనకొండ, మార్చి 15 : రానున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీకి చెందిన దాదాపు 200 మందిపై ఇటీవల బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇటీవల పలు గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులను ముందస్తుగా అదుపులోకి తీసుకొని మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ సమక్షంలో హాజరుపరిచి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నా రు. మండలంలో ఇండ్లచెరువు, గంగదేవిపల్లి, దొండపాడు, కొచ్చెర్లకోట గ్రామాలను ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించడం జరిగిందని ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని గ్రామాల్లో ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తూ అప్రమత్తం చేస్తున్నామని ఎస్‌ఐ సంపత్‌కుమార్ వివరించారు.

ప్రజాగళం సభకు భారీగా తరలిరండి

టీడీపీ ఇన్‌చార్జ్ గోరంట్ల రవికుమార్

ముండ్లమూరు, మార్చి 15 : పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో ఆదివారం జరిగే ప్రజాగళం సభకు నియోజక వర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పార్టీ దర్శి ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని పోలవరం, శంకరాపురం మధ్య సభకోసం వచ్చే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏర్పాటు చేస్తున్న భోజన ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హాజరైన దర్శి, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల నాయకులతో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మరో రెండు నెలల్లో వైసీపీ ప్రభుత్వం కూలిపోనుందన్నారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే టీడీపీకి 160 స్థానాలకు పైగా వస్తాయనడంలో ఎలాంటి ఢోకా లేదన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. అభివృద్ధి అనే మాటే లేదన్నారు. కార్యక్రమంలో ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, ఓబులరెడ్డి, నాగులపాటి శివ కోటేశ్వరరావు, జిల్లా టీడీపీ నాయకులు మానం రమేష్ బాబు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కే నాగరాజు, కూరపాటి నారాయణస్వామి, నిడమానూరి శ్రీనివాసరావు, జిల్లెలమూడి చౌదరి, రావెల శ్రీనివాసరావు, మధు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కొర్రపాటి బుచ్చిబాబు, పవన్, పాలెపోగు రాజు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న రవికుమార్ నేతలు

రాష్ట్రంలో చీకటి పాలనను తరిమేయాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 15: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న చీకటి పాలనను తరిమేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపనిచ్చారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో పార్టీ నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి వైపు దూసుకుపోతే జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పాతాళంలోకి పడిపోయిందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయని ఆరోపించారు. పెరిగిన నిత్యావసరాలతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని సహజ సంపదలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను జగన్ దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు జగన్ కుయుక్తులు, కుట్రలు పన్నేందుకు సిద్ధమయ్యారన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు పూనుకుంటు న్నాడన్నారు. ప్రజలు కూడా మరో సారి మోసపోకుండా విజ్ఞతతో ఓటును వినియోంచుకోవాలని కోరారు. రాక్షసులను అంతమొందించేందుకు దేవతలందరూ ఏకమైనట్లు పురాణాలు చెప్తున్నాయన్నారు. రాష్ట్రంలో జగనాసుర రెడ్డి పాలనను అంతమొందించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీలు ఏకమయ్యాయన్నారు. కూటమిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ మెజార్టీ గత రికార్డులను బద్దలు గొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 17న చిలకలూరిపేటలో జరిగే కూటమి సభకు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

ఉగ్ర సమక్షంలో చేరిక

పామూరు : జగన్‌రెడ్డి అరాచక పాలనతో విసుగుచెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరడం కూటమి విజయానికి సంకేతమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ ఇల్లూరి రామిరెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఉగ్ర పాల్గొన్నారు. మండలంలోని అయ్యన్నకోట గ్రామంలో సానికొమ్ము విజయ భాస్కరరెడ్డి, కుందూరు తిరుపతిరెడ్డి, తుమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఉగ్ర పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ బీ జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కేతు విజయభాస్కరరెడ్డి, ఏ ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, సయ్యద్ అమీర్‌బాబు, వై.ప్రసాద్ రెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, రమణయ్య, వీరబాబు పాల్గొన్నారు.



పామురులో విజయకేతనం చూపుతున్న కార్యకర్తలు

రజకులు టీడీపీ రుణం తీర్చుకోవాలి

మార్కాపురం రూరల్, మార్చి 15 : రాష్ట్రంలోని రజకు లంతా కలిసి టీడీపీ రుణం తీర్చుకుంటామని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి కనిగిరి బాలవెంకటరమణ అన్నారు. పట్టణంలోని కంభం బస్టాండ్ కూడలిలోని టీడీపీ కార్యాలయంలో బీసీ నాయకులతో కలిసి శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో నిర్వహించారు. గుంటూరు-2 అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా వచ్చే ఎన్నికల్లో రజక కుటుంబ సభ్యురాలైన పిడుగురాళ్ల మాధవికి నారా చంద్రబాబు అసెంబ్లీ టికెట్ కేటాయించాడన్నారు. 1983 సంవత్సరం నుంచి కూడా టీడీపీ తోనే రజకులకు ఇతర బీసీకులాలకు న్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలు ఏకతాటిపైకి వచ్చి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రజక నాయకులు నరసింహా రావు, శివయ్య, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్, మార్చి 15: మార్కాపురంలోని 15వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం రాత్రి నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డికి హారతులు, పూల దండలు, శాలువలతో ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. రానున్న టీడీపీ -జనసేన-బీజేపీ ప్రభుత్వంలో తప్పక సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జులు వక్కలగడ్డ మల్లికార్జున, కొప్పుల శ్రీనివాసులు, 15వ వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

బేస్తవారపేట : రాష్ట్రం టీడీపీతోనే అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న ఓబినేనిపల్లె గ్రామంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని దీంతో రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలోచెట్టిచెర్ల మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి,ఆవుత శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కార్యకర్తలు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేస్తాం

- ఆ పార్టీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 15 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ జెండాను ఎగుర వేస్తామని గిద్దలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాచర్ల మండలం యడవల్లి గ్రామంలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేన, ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడారు. గిద్దలూరు నియోజకవర్గంలో ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో ఘనవిజయం సాధిస్తామన్నారు. పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన వలస నాయకులను నమ్మే పరిస్థితిలో గిద్దలూరు ప్రజలు లేరన్నారు. తాను శాసనసభ్యునిగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తానెప్పుడు కక్ష సాధింపు రాజకీయాలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో స్థానికంగా ప్రజల మధ్య నివాసం ఉండే తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు కటికె యోగానంద్, సర్పంచ్ భవనం పుల్లారెడ్డి, భవనం శ్రీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఇరగనబోయిన గోపాల్, మెర్రి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, వెన్నం శ్రీనివాసరెడ్డి, కీర్తి పెద్దవెంకటయ్య, తంబాల వెంకటేశ్వర్లు, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, కొండయ్య, బాష్యం పెద్దవీరయ్య తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న అశోక్‌రెడ్డి

అవీ..ఇవీ..

విద్యార్థుల క్షేత్ర పర్యటన



క్షేత్రపర్యటనకు వచ్చిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 15: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్, పేటెంట్ ఫెసిలిటేషన్ హాక్ కి ఇన్నో వేషన్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనను 200 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సెన్సార్లు, రోబోటిక్స్, డ్రిల్లింగ్ స్టేషన్లు, భద్రతా జాగ్రత్తలు, ఆవిష్కరణ, సాంకేతిక అవగాహనను పెంపొందించడంలో అనుభవాన్ని అందించారు.

డల్లాస్‌లో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం

దర్శి మార్చి 15 : అమెరికాలోని డల్లాస్‌లో దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వెంకట్ డల్లాస్‌లో కేకు కట్ చేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమన్నారు. ప్రవాసాంధ్రులు ఈ కూటమి విజయానికి తమవంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, ఆరిమిల్లి రాధాకృష్ణ, జ్యోతుల నెహ్రూ, జాగర్లమూడి సుగుణ్, పొణిదల లోకేష్, చింతమనేని సుధీర్, కిశోర్, తిరుమళశెట్టి సజిత పాల్గొన్నారు.



డెల్లాస్‌లో కేకు కట్ చేస్తున్న వెంకట్

సీసీ రోడ్డు పనులను అడ్డుకున్న మహిళలు

పెద్దదోర్నాల, మార్చి 15: స్థానిక శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం వద్ద నిర్మిస్తున్న సిమెంటురోడ్డు నిర్మాణం పనులను ముస్లిం మహిళలు శుక్రవారం అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే దోర్నాలలోని ఇందిరానగర్‌లో గతంలో నిర్మించిన సిమెంటు రోడ్డు సక్రమంగా లేక పల్లంగా ఉంది. చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు నిల్వ ఉండి నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇందిరానగర్‌కు చెందిన ప్రజలు మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు పునఃనిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ పనులు ప్రారంభించలేదు. అయితే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతనంగా ఎంపీపీ పద్మజ తండ్రి వీధిలో, సాయిబాబా మందిరం ఎదురువీధిలో సిమెంటు రోడ్డు పనులు ప్రారంభిస్తుండడంతో సమాచారం తెలుసుకున్న ఇందిరా నగర్ వాసులు నిర్మాణ పనులు అడ్డుకున్నారు. మా వీధిలో నిర్మాణం చేపట్టాకే ఎక్కడైనా రోడ్డు నిర్మాణం చేపడతానని మంత్రి సురేష్ తమకు హామీ ఇచ్చారని ముస్లిం మహిళలు ఆందోళనకు దిగారు. తమ రోడ్డు నిర్మించిన తర్వాతే మిగిలిన ఈ రోడ్డు పనులు ప్రారంభించాని చెప్పడంతో కాంట్రాక్టర్ వెనుతిరిగాడు.


తెలుగుదేశం పార్టీ
ప్రజాగళం బహిరంగ సభకు
రండి.. కదలిరండి.. తరలిరండి..
యువత భవిత కోసం, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం..
మార్పుకై సాగుతున్న మహా సంగ్రామ పోరాటంలో
మీరు భాగం అవ్వండి.
తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి
బహిరంగ సభకు భారీ ఎత్తున హాజరై
విజయవంతం చేయండి.
తేదీ:17-03-2024
ఆదివారం రోజున
బొప్పూడి, చిలకలూరిపేట
మధ్యాహ్నం 4 గంటలకు
బాబు ష్యూరిటీ
సంక్షేమం అభివృద్ధి
భవిష్యత్తు గ్యారెంటీ
తెలుగుదేశం పార్టీ
సైకిల్ గుర్తుకే మన ఓటు
సవరపు ప్రసాద్ బాబు
బాపట్ల పార్లమెంట్ తెలుగు దేశం నాయకులు
జై తెలుగుదేశం.. జై చంద్రబాబు..


తెలుగుదేశం పార్టీ
ప్రజాగళం బహిరంగ సభకు
రండి.. కదలిరండి.. తరలిరండి..
యువత భవిత కోసం, ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తు కోసం..
మార్పుకై సాగుతున్న మహా సంగ్రామ పోరాటంలో
మీరు భాగం అవ్వండి.
తెలుగుదేశం - జనసేన - బీజేపీ కూటమి
బహిరంగ సభకు భారీ ఎత్తున హాజరై
విజయవంతం చేయండి.
తేదీ:17-03-2024
ఆదివారం రోజున
బొప్పూడి, చిలకలూరిపేట
మధ్యాహ్నం 4 గంటలకు
బాబు ష్యూరిటీ
సంక్షేమం అభివృద్ధి
భవిష్యత్తు గ్యారెంటీ
తెలుగుదేశం పార్టీ
సైకిల్ గుర్తుకే మన ఓటు
సవరపు ప్రసాద్ బాబు
బాపట్ల పార్లమెంట్ తెలుగు దేశం నాయకులు
జై తెలుగుదేశం.. జై చంద్రబాబు..





బొప్పూడిలో.. ప్రజాగళం



- రేపటి సభకు నామకరణం
- 300 ఎకరాల్లో అసాధారణ ఏర్పాట్లు
- పనులను పరిశీలించిన కూటమి నేతలు
- ఎస్పీజీ నిఘాలో వేదిక, హెలిప్యాడ్ల నిర్మాణం
- సభను విజయవంతం చేయాలని నేతల పిలుపు

చిలకలూరిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఆదివారం నిర్వహించనున్న బహిరంగ సభకు ప్రజాగళంగా నామకరణం చేశారు. 300 ఎకరాల సువిశాల ప్రాంగణంలో అసాధారణ రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. బొప్పూడి వేదిగా ఎన్‌డీఏ నేతలు ప్రజాగళాన్ని వినిపించనున్నారు. సభకు మూడు పార్టీల కార్యకర్తలు, నేతలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వేదిక, వీఐపీ గ్యాలరీ, వాహనాల పార్కింగ్, బారికేడ్ల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానుండటంతో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రాంగణం అంతా బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. ఎస్పీజీ నిఘాలో సభావేదిక, హెలిప్యాడ్ల నిర్మాణం జరుగుతుంది. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రత్యేక హెలికాప్టర్లలో సభా ప్రాంగణానికి రానున్నారు. దీంతో వీరి కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్ల నిర్మాణాలు చేపట్టారు. సభకు వచ్చే లక్షలాది మందికి అవసరమైన భోజనం, తాగునీరు వంటి సౌకర్యాలను సమకూరుస్తున్నారు. ఆయా ఏర్పాట్లను సదరు కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి.



వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు

పనులను పరిశీలించిన నేతలు

సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి పాతూరి నాగభూషణం, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ, జనసేన నాయకులు టీడీ జనార్ధన్, నన్నపనేని రాజకుమారి, కొమ్మారెడ్డి పట్టాభిరాం, కళ్యాణం శివశ్రీనివాస్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీ మాగంటి బాబు తదతర నేతలు పరిశీలించారు.

అత్యవసర వైద్యానికి ఏర్పాట్లు

మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ముఖ్య నేతలు సభకు వస్తున్న సందర్భంగా అవసరమైతే అత్యవసర వైద్య సదుపాయం కోసం చిలకలూరిపేటలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని సిద్ధం చేశారు. వైద్యశాఖ, ఎస్పీజీ అధికారులు సభా ప్రాంగణం నుంచి ఆస్పత్రి వరకు శుక్రవారం ట్రయిల్ రన్ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కొమ్మినేని వీరశంకర్‌తో మాట్లాడారు. శని, ఆదివారాల్లో ఆస్పత్రిలో కొన్ని ప్రత్యేక రూములను ఏర్పాటు చేసి ఉంచాలని కోరారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే పొత్తు

రాష్ట్ర భవిష్యత్ కోసమే మూడు పార్టీలు పొత్తుపెట్టుకున్నట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రాష్ట్రం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు పొత్తును ఆశీర్వదించాలన్నారు. మూడు పార్టీల ఆధ్వర్యంలో మొదటిసారి బొప్పూడిలో జరిగే ప్రజాగళం సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే వారంతా ప్రజాగళం సభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, బీజేపీ నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు. పాతూరి నాగభూషణం మాట్లాడుతూ ప్రజాగళం సభ వైసీపీకి విషగర శంగా మారుతుందన్నారు. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నార న్నారు. పండుగ వాతావరణంలో జరిగే ప్రజా గళం సభకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని పిలుపునిచ్చారు.



సిద్ధమవుతున్న హెలీప్యాడ్‌లు



సభా ప్రాంగణం

సభకు బస్సులు కావాలి

- ఆర్టీసీ అధికారులకు టీడీపీ నేతల వినతులు
- బస్సుల ఏర్పాటులో తటపటాయిస్తోన్న అధికారులు

గుంటూరు: ఎన్‌డీఏ ఆధ్వర్యంలో బొప్పూడిలో జరిగే ప్రజాగళం సభ కోసం జనసమీకరణకు ఆర్టీసీ బస్సులు కావాలని టీడీపీ నేతల నుంచి ఆర్టీసీ అధికారులకు విజ్ఞాపనలు వస్తున్నాయి. తమకు 17న సభకు బస్సులు కావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థులు కోరినట్లు ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. పొన్నూరు, మంగళగిరి, గుంటూరు పశ్చిమ నియోజక వర్గాల నుంచి ఇప్పటికే 70 నుంచి 90 బస్సుల వరకు కోరినట్లు సమాచారం. పల్నాడు నియోజకవర్గం నుంచి అత్యధిక స్థాయిలో బస్సులు కావాలని కోరినట్లు తెలిసింది. అయితే బస్సుల ప్రతిపాదనలపై తమకు నివేదించాలని జిల్లా అధికారులకు ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీంతో డిపో అధికారులు తమకు వచ్చిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదించే పనిలో ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సులు కేటాయిస్తామని ఇన్‌చార్జి డీపీటీవో నర్రా శ్రీనివాసరావు తెలిపారు. అయితే వైసీపీ నేతలు అడిగిందే తడవుగా బస్సులు సమకూరుస్తోన్న అధికారులు ఉమ్మడి సభకు సంబంధించి బస్సుల ఏర్పాటులో తటపటాయిస్తోన్నారన్న విమర్శలున్నాయి.

నేడే

- మధ్యాహ్నం 3 గంటలకు షెడ్యూల్ ప్రకటన
- ఆ వెంటనే అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి
- ఏ దశలో ఎన్నికలు జరుగుతాయనేదానిపై సర్వత్రా ఉత్కంఠ

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నగార శనివారం మోగనుంది. జాతీయ ఎన్నికల సంఘం ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటన శనివారం మధ్యాహ్నం ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఎన్ని విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తుంది, ఆంధ్రప్రదేశ్‌లో ఏ దశలో జరుగుతాయనే అంశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. 2019లో తొలి విడతలోనే ఏపీలో ఎన్నికలు జరిగాయి. ఈ దఫా ఏ విడతలో జరుగుతాయో చూడాలి. కొన్ని పార్టీలు తొలి విడతలో జరగాలని, చివరి విడతల్లో జరిగితే బావుంటుందని మరికొన్ని పార్టీలు భావిస్తున్నాయి. అయితే ఏ విషయం శనివారం సాయంత్రం లోపు తేలిపోతుంది. ఢిల్లీలో ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే జిల్లా ఎన్నికల అధికారులు వేణుగోపాల్‌రెడ్డి(గుంటూరు), శివశంకర్ (పల్నాడు), రంజిత్‌బాషా (బాప ట్ల)లు ఎక్కడికక్కడ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. షెడ్యూల్ ప్రక టన తర్వాత నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని ఆయా అధికారులు ప్రకటిస్తారు. ఆ తర్వాత నుంచి అనుమతి లేని ఫ్లెక్సీలు, జెండా దిమ్మెల తొలగింపు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడగ డం వంటివి చేపడతారు.

ఇక నుంచి ఖర్చులకు కట్టడే..

ఇప్పటివరకు ఎన్నికల్లో సీట్లు ఆశిస్తున్న అభ్యర్థులు ప్రచార కార్యక్రమాల కోసం పెద్ద ఎత్తున ఖర్చు పెట్టారు. సీట్లు ఖరారు అయిన వారు కూడా ప్రచారాల కోసం విస్తృతంగా వ్యయం చేస్తున్నారు. అయితే శనివారం షెడ్యూల్ ప్రకటన తర్వాత నుంచి అంటే శనివారం నుంచి ఆచితూచి ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ప్రచారాలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ ఆమోదం తీసుకోవాలి. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడే ఖర్చులు పెట్టి ఆ వివరాలను ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ కమిటీకి అందజేయాల్సి ఉంటుంది. అంటే ఒకవిధంగా వారి ప్రచార ఖర్చులకు కళ్లెం పడినట్లే.

ప్రతీ దానికి అనుమతి తీసుకోవాల్సిందే

ఆదివారం నుంచే జిల్లా వ్యాప్తంగా జరిగే రాజకీయ పార్టీల సభలు, ర్యాలీలు, సమా వేశాలకు ముందస్తుగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలానే రాత్రి 10 గంటల వరకే ఎన్నికల ప్రచార కార్యక్రమాల నిర్వహణకు అనుమతి ఉం టుంది. వీవీఐపీల పర్యటనల సమయంలో హెలికాప్టర్‌లు, డ్రోన్‌లకు కూడా అనుమతులు తీసుకోవాలి.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు శుభం కార్డు

కొన్ని రోజుల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు పెద్దఎత్తున అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తున్నారు. ఇటీవల సిమెంట్‌రోడ్లు, పైపులైన్లు, కాలువల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి పనులు చేయిస్తున్నారు. కొన్ని అయితే ఇప్పటికే పూర్తికాగా వాటిని రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవాలు కూడా చేశారు. వీటికి శనివారం సాయంత్రం నుంచి శుభంకార్డు పడనుంది. ఇకపై ఎవరైనా శంకుస్థాపన చేసినా, అభివృద్ధి పనికి ప్రారంభోత్సవం జరిపినా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. వలంటీర్లను పోలింగ్ ఏజంట్లుగా కూడా నియమించడానికి వీల్లేదని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఎస్ ఉత్తర్వులను పంపించారు. దీంతో శనివారం నుంచి వలంటీర్ల కదలికలపై గట్టి నిఘానే ఉంటుంది.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.23(శనివారం)
సహరీ (ఉదయం) 4.58 (ఆదివారం)

ఈ-కేవైసీలపై ఒత్తిడి



- అర్ధరాత్రి సంక్షేమ లేఖల పంపిణీ
- సచివాలయ ఉద్యోగుల అనధికార వాడకం
- కోడ్‌తో శనివారంకల్లా పూర్తి చేసి..
- ఆ తర్వాతే ఇళ్లకెళ్లాలని హుకుం
- ఉన్నతాధికారుల అదేశాలతో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పరుగులు
- ఒక్కో ఉద్యోగికి ముగ్గురు వలంటీర్లు..
- ఒక్కో వలంటీర్‌కు ఐదు కుంటుంబాల బాధ్యత

గుంటూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలన్నింటికీ ఈ-కేవైసీ చేయించాలి. ముఖ్యమంత్రి పేరుతో ప్రతి లబ్ధిదారుడి పేరుతో వచ్చే లేఖను వారికిచ్చి అది కూడా ఈకేవైసీ చేయించాలి. ఈ మొత్తం వ్యవహారం కోడ్ వచ్చే లోపు.. అంటే శనివారం మధ్యాహ్నానికల్లా పూర్తి చేయాలి. ఆ తర్వాతే ఇళ్లకు వెళ్లాలి. అర్ధరాత్రి అయినా.. అపరాత్రి అయినా ఆ పని పూర్తి చేయా ల్సిందే..' అని సచివాలయ ఉద్యోగులపై ఉన్నతాధి కారుల అదేశాలు. ఉద్యోగులు, వలంటీర్ల గ్రూపుల్లో ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ అధికారులు వారిని పరుగులు పెట్టిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్న వార్త తెలియగానే వారిపై ఇప్పటి వరకూ ఉన్న ఒత్తిడి తారస్థాయికి చేరింది. దీంతో ఒత్తిడి భరించలేని ఉద్యోగులు లబ్ధిదారుల వేటలో పడ్డారు. ఆఫీసులు వదిలి వలంటీర్లను వెంటబెట్టుకుని శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధ రాత్రి వరకు రోడ్లవెంట తిరు గుతున్నారు. సచివాలయ ఉద్యోగులను సొంత కార్యక్రమాలకు అడ్డగోలుగా వాడేస్తోందనడానికి ఇదో ఉదాహరణ.

ఈ ఒక్క రోజు అర్జెంట్ గా అందరు సచివాలయం functionaries కూడా ఫీల్డ్ కి వెళ్లి HCM LETTER distribution కంప్లీట్ చేయవలెను. అలాగే వాలంటీర్ ల దగ్గర ఆరోగ్య శ్రీ కార్డు లు ఏమైనా వున్నా, మిస్సింగ్ ఫోటో EKYC లు ఏమైనా వున్నా అర్జెంట్ గా కంప్లీట్ చేయమని చెప్పండి అర్జెంట్ సీరియస్ గా తీసుకొని ఈ ఒక్క రోజు అందరు functionaries కష్ట పడండి.

సచివాలయ ఉద్యోగులకు అందిన వాట్సాప్ సందేశాల స్క్రీన్‌షాట్స్..

ఎన్నికలు సమీపించే కొద్దీ వారిపై విపరీతంగా ప్రభుత్వం ఒత్తిడి పెంచింది. గత నెల రోజులుగా సచివాలయ విధులతోపాటు ఈ- కేవైసీల పేరుతో వారిపై మోయలేని భారం మోపింది. కేవలం వలంటీర్లకే పరిమితమైన ఈ-కేవైసీ లాగిన్లను సచివాలయ ఉద్యోగులకు కూడా కేటాయించి వారిని కూడా వీధుల వెంట తిప్పుతోంది. హెచ్‌సీఎం లెటర్ పంపిణీ చేసి లబ్ధిదారుల వేలిముద్రతో ఈ- కేవైసీ చేయించేందుకు ఒక్కో సచివాలయ ఉద్యోగికి ముగ్గురు వలంటీర్ల బాధ్యత అప్పగించారు. వారితోపాటు సచివాలయ ఉద్యోగులు కూడా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ-కేవైసీ లోగుట్టు ఒక్కో వలంటీరుకు ఐదు కుటుంబాల ఓట్లను ఖాయం చేయడమేనని సమాచారం. ఇందుకోసం రహస్య సమావేశాలు పెట్టి అధికారపార్టీ నేతలు మౌఖిక ఆదేశాలు కూడా జారీ చేశారు. వారిని సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులకే అప్పగించారు.

కోడ్ కోసం ఎదురుచూపులు

ఈ-కేవైసీ భారం, అధికార పార్టీ నేతల ఆదేశాల నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులు సతమతమవుతున్నారు. ఈ ఒత్తిడి నుంచి బయటపడే మార్గం లేక శారీరకంగా, మానసికంగా కూడా కుంగిపోతున్నట్లు పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. మార్చి నెల మొదలైననాటి నుంచి ఎన్నికల కోడ్ కోసం ఎదురు చూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే కోడ్ అమలులోకి వస్తుంది.. అధికారులు, అధికార పార్టీ నేతల ఒత్తిడి తగ్గుతుందని వారు ఆశపడ్డారు. నోటిఫికేషన్ జాప్యం జరిగేకొద్దీ వారు కుంగిపోతున్నారు. శనివారం నుంచైన కోడ్ అమలులోకి వస్తే ఊపిరి పీల్చుకోవచ్చని వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యం



- అర్హుల ఓటు హక్కు వినియోగానికి చర్యలు
- పోలింగ్ బూత్‌ల వద్ద మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ
- 85 ఏళ్లు దాటిన వారు దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుంచే ఓటు
- ఎన్నికల సన్నద్ధతపై ఆంధ్రజ్యోతితో కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'శాంతియుత ఎన్నికలే లక్ష్యం. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూస్తాం. ఈసీ మార్గదర్శకాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోం. ఓటర్లు అందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే వాతావరణాన్ని కల్పిస్తాం. నగదు, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన రోజు నుంచే డబ్బు తరలింపుపై నిఘా పెడతాం..' అని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఫారం-6లు స్వీకరిస్తాం

గత ఏడాది జూన్ నుంచి స్పెషల్ సమ్మరి రివిజన్‌ను పకడ్బందిగా నిర్వహించాం. ఈ ఏడాది జనవరి 22న స్పెషల్ సమ్మరి రివిజన్‌ను పూర్తి చేశాం. నామినేషన్ల దాఖలు గడువు తేదీ వరకు కొత్త ఫారం-6లు మాత్రమే స్వీకరిస్తాం. నామినేషన్ గడువుకు పది రోజుల ముందు వచ్చిన దరఖా స్తుల న్నింటినీ నిబంధనల ప్రకారం పరిష్కరిస్తాం.

1510 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు..

జిల్లా వ్యాప్తంగా 1510 పోలింగ్ స్టేషన్లను గుర్తించాం. దివ్యాంగుల సౌలభ్యం కోసం ర్యాంప్‌ను, వీల్‌చైర్స్‌ను అందుబాటులో ఉంచుతాం. 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును ఈసీ తొలిసారి కల్పించింది. వారు నోటిఫికేషన్ వచ్చాక దరఖాస్తు చేసుకుంటే ఇంటినుంచి ఓటు వేసే అవకాశం కల్పిస్తాం.

సిబ్బందికి శిక్షణ

పోలింగ్ విధుల్లో భాగస్వాములయ్యే సిబ్బందికి ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ఇచ్చాం. ఆర్‌వోలు, ఈఆర్‌వోలను ఇప్పటికే అపాయింట్ చేశాం. పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించేలా సిబ్బందికి అన్ని అంశాలపై అవగాహన కల్పించాం.

27 చెక్‌పోస్టులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన దగ్గర నుంచి 50,000కు పైన నగదు తీసుకెళ్లాలంటే కచ్చితంగా తగిన ఆధారాలు చూపించాలి. లేకుంటే సీజ్ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 27 చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఓటర్లకు నగదు పంపిణీ, ప్రలోభాలు ఇతరత్రా ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. వాటిపై తక్షణమే చర్యలు తీసుకునేలా ఆదేశిస్తాం.అర్హులైన ఏ ఒక్కరూ ఓటుకు దూరం కాకూడదనే విధం గా నమోదు ప్రక్రియ చేపడుతున్నాం. వారు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియో గించుకునేలా చర్యలు తీసుకుంటు న్నాం. కొత్త ఓటరు నమోదుపై అవ గాహన శిబిరాలను చేపట్టాం. అందుకు తగ్గట్లే తొలిసారి ఓటు హక్కు విని యోగించుకునే వారి సంఖ్య జిల్లాలో గణనీయంగా

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి


నెహ్రూ కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి

చీరాల, మార్చి 15: పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి చెప్పారు. శుక్రవారం పట్టణంలో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు, దుకాణదారులు, కూరగాయలు, పండ్ల మార్కెట్‌లో దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. ఎరికివారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో, పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అద్దంకిటౌన్, మార్చి 15: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో -2 బూదాటి సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 జూన్ 2 నుంచి 2019 మే 31 మధ్య జన్మించినవారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 25లోగా అన్ని సచివాలయాలు, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

18 నుంచి ఒంటిపూట బడులు

అద్దంకిటౌన్, మార్చి 15: మండలంలోని అన్ని యాజమాన్య ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకు ఉదయం పూట బడులు నిర్వహించాలని ఎంఈవో1 డి.గంగాధర్, ఎంఈవో2 బి.సుధాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించాలని పేర్కొన్నారు.

పాఠశాలకు వితరణ

పంగులూరు, మార్చి 15: మండలంలోని నూజెళ్ళపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు రూ.12 వేల విలువ చేసే మూడు సిమెంట్ బల్లలు సమకూర్చారు. పాఠశాల ప్రాంగణంలో పిల్లలు సేదతీరేందుకు వీలుగా వీటిని ఏర్పాటుచేశారు. ఖమ్మం జిల్లాలో గ్రానైట్ వ్యాపారంలో స్థిరపడిన పమిడిపాడు గ్రామస్థుడు కేమా ఆంజనేయులు, భార్య వెంకటరత్నం జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు లక్ష్మీనారాయణ వీటిని సమకూర్చినట్లు ప్రధానోపాధ్యాయుడు వీరాంజనేయులు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు దాత లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

బల్లికురవ, మార్చి 15: బల్లికురవలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) జూనియర్ కళాశాలలో 2024-2025లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.సరళకుమారి పేర్కొన్నారు. 6వ తరగతి, ఇంటర్ ఎంఈసీలో చేరేందుకు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9110369460, 7780225478, 8639734009 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

కూటమి సభకు తరలిరావాలి

కొత్తపేట(చీరాల), మార్చి 15: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17న జరగనున్న టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి సభకు చీరాల నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని ఆయా పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసమీకరణకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, ఏడుకొండలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పాల్గొనే ప్రజాగళం సభను విజయవంతం చేసేందుకు ఐక్యంగా ముందుకు సాగుదామని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మూడు పార్టీల ప్రతినిధులు తమ తమ అభిప్రాయాలను తెలి పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చీరాల, మార్చి 15: మండల పరిధిలోని జాండ్రపేట, తోటవారిపాలెం గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి సాయంచేయాలి

చీరాలటౌన్, మార్చి 15: ఆపదలో ఉన్నవారికి సాయం అందించి మానవత్వం చాటుకోవాలని మాజీమంత్రి జాగర్లమూడి లక్ష్మీపద్మావతి పేర్కొన్నారు. పోతూరి భూలక్ష్మీకుమారి జ్ఞాపకార్థం భర్త శ్యామ్‌సుందరరావు ఆర్థిక సహకారంతో స్థానిక మహిళా మండలి ఆధ్వర్యంలో 25 మంది హెచ్‌ఐవి రోగులకు రూ.8 వేలు విలువగల పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, పీడీ శ్రీనివాసరెడ్డి, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, మార్చి 15: దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం షేక్ కాలేషావలి అన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, జామిత్రీ బాక్సులు, లాంగ్ స్కేల్‌లను దాతలు శుక్రవారం అందజేశారు. పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు 35 మందికి రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కుక్కలవారిపాలెం సరస్వతి ట్యూషన్ ప్రిన్సిపాల్ వడ్లమూడి వేణుబాబు అందజేసిన ప్యాడ్లు, పలువురు దాతలు అందజేసిన పెన్నులు, లాంగ్ స్కేల్స్, జామెంట్రీ బాక్సులను దాతలు, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో కడవకుదురు జడ్పీ పాఠశాల హెచ్‌ఎం కుర్రా రామారావు, ఉపాధ్యా యులు రంగని శ్రీనివాసరెడ్డి, పద్మనాభం, అంకయ్య, పోతురాజు, వీరేశ్వర శాస్త్రి రమణి, పి.శ్రీలక్ష్మి, నాగమణి, మల్లిక పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

మార్టూరు, మార్చి 15: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి కనబరచే విధంగా కృషి సఖిలు ప్రోత్సహించాలని ఏపీఎం చిన్నయ్య అన్నారు. గత ఐదు రోజుల నుండి ప్రకృతి వ్యవసాయంపై కృషి సఖిలకు ఇస్తున్న శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చిన్నయ్య మాటాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా కృషి సఖిలకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. మార్టూరులో జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మోహన్, ఏపీఎం రాజారత్నం, రాజశేఖర్, లక్ష్మీప్రసన్న, వెంకటేశ్వర్లు, అశోక్ కుమార్, అప్పారావు, భారతి, ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీరాలటౌన్, మార్చి 15: దండుబాట ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం తాత్కాలిక అంతరాయం కలుగుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైకుంఠపురం, విఠల్‌నగర్, ఉజిలీపేట, జయంతిపేట, ప్రాంతాలలో ఈ అంతరా యం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

మూడు పార్టీల కలయిక రాష్ట్ర భవిషత్తు కోసమే

అద్దంకిటౌన్, మార్చి 15: మూడు పార్టీల కలయిక రాష్ట్ర భవిషత్తు కోసమేనని, ఈనెల 17న బొప్పూడిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి అద్దంకిలోని కామేపల్లి కల్యాణ మండపంలో అద్దంకి పట్టణ, రూరల్ గ్రామాల టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు ప్రజాగళం సభకు తరలిలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. అందుకు ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు చిన్ని లక్ష్మీశ్రీనివాసరావుతో పాటు పరిశీలకులు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు!

- 17న 'ప్రజాగళం'కు తరలిరావాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, మార్చి 15: అరాచక వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం బల్లికురవలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17 చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి వద్ద టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజాగళం పేరుతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈసభకు పెద్ద ఎత్తున కదలి రావాలని పిలుపునిచ్చారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పాటయిన తదుపరి మొదటిసారిగా జరుగుతన్న బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ హాజరవుతున్నట్టు చెప్పారు. బల్లికురవ మండలం నుంచి 30 వేల మంది వరకు తరలిరావాలన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు గుణపాఠం చెప్పేందుకు కూటమి ఏర్పాటయిందన్నారు. ఈనెల 10న మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభ అట్టర్ ఫ్లాప్ అయిందన్నారు. 15 లక్షల మంది వచ్చారని ప్రచారమేనని, అక్కడ వచ్చింది లక్ష మందే అని అన్నారు. గ్రీన్ మ్యాట్లు వేసి గ్రాఫిక్స్ సినిమా చూపించారని అన్నారు. టీడీపీ సభ చూశాక వారికి బహిరంగ సభ ఎలా ఉంటుందో అర్థం అవుతుందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు.

సమావేశంలో మండల పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, పావులూరి సత్యనారాయణ, అమరనేని కాశీవిశ్వనాథం, గొట్టిపాటి లక్ష్మయ్య, చెరుకూరి అంజయ్య, పోగుల చంద్రశేఖర్, గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, ముంద్రు చిన దానయ్య, దద్దాల అంజయ్య, కోట శ్రీనివాసరావు, తన్నీరు ఏడుకొండలు, పరుసు ప్రసాద్, మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్, నాగినేని సాంబయ్య, వేల్పుల దానయ్య, బాపట్ల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్, అమరనేని వినోద్, గుంజి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే కూటమి

పంగులూరు, మార్చి 15: రాష్ట్ర భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పాడ్డాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరంలోని టీడీపీ మండల కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కొరిశపాడు, పంగులూరు మండలాల పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నాయకుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలకలూరిపేట మండలం బొప్పూడి వద్ద ఈనెల 17న జరిగే ప్రజాగళం సభకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికలలో జగన్మోహనరెడ్డి పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని చెప్పారు. జగన్మోహనరెడ్డి పాలనను అంతమొందించి, రాష్ట్రంలోని ఐదు కోట్లమంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చే లక్ష్యంతో మూడు పార్టీలు ఒకతాటిపై నిలిచాయన్నారు. బొప్పూడి వేదికగా నిర్వహించబోయే బహిరంగసభ రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు దశ, దిశ నిర్దేశించనున్నట్లు చెప్పారు. సభకు అద్దంకి నియోజకవర్గం నలుమూలల నుండి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. జగన్మోహనరెడ్డి గద్దెదిగే రోజు దగ్గరలోనే ఉందని అన్నారు. ప్రజలు కూటమికి మద్దతుగా నిలుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంగులూరు, కొరిశపాడు మండలాల టీడీపీ నేతలు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.


బల్లికురవలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

టీడీపీలో చేరిన కొరిశపాడు కాలనీవాసులు

మేదరమెట్ల, మార్చి 15: కొరిశపాడుకు చెందిన పలువురు ఎస్సీ కాలనీవాసులు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం రాత్రి కొరిశపాడు వచ్చిన రవికుమార్‌కు గ్రామస్థులు మేళతాళాలు, బాణ సంచాతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా 25 కుటుంబాలు రవికుమార్ సమక్షంలో టీడీపీకి మద్దతు ప్రకటించారు. రవికుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ అ మలు చేసిన పలు పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. కొరిశపాడు ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్ల నిర్మాణంతో పాటు జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి రెండు వరుసల సిమెంట్ రోడ్డు నిర్మాణం తానే మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయించినట్టు చెప్పారు.

తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో చేగుండి అమర్‌నాథ్, గుడిమిట్ల శ్రీకాంత్, బెజవాడ దుర్గారావు, వేణు, త్రిమూర్తి, సుబ్బయ్య, బి.శ్రీను, మహేష్, బద్రీ, శివ, కళ్యాణ్, జ్యోతి, గురవయ్య, చిన్న వెంగయ్య, పి.వెంగయ్య, రాజేష్, అశోక్, చిన్న, కార్తీక్, వెంకటేశ్వర్లు, జి.శ్రీను, పూర్ణచంద్రరావు, మార్కు, హరిబాబు, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

- వచ్చే ఎన్నికల్లో కూటమిదే అధికారం
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కొత్తపాలెం గ్రామస్థులు

చినగంజాం, మార్చి 15: రాష్ట్రంలో నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని చెప్పారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలో గల క్యాంపు కార్యాలయంలో చినగంజాం మండలం కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని సత్తాయి మాలపల్లి గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు రాజు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో సేరు నరసింహామూర్తి, వల్లెపు సుబ్బారావు, మెడ హనుమంతరావు, దేవరకొండ ధనుంజయ్, వల్లెపు బాలజీ, ప్రతాప్, లక్ష్మీనారాయణ, బేతాల జోహానుమబాబు, మేడ శ్రీను, పంది సుగుణరాజు, సోపర్ల ఇమ్మానియేలురెడ్డి, సేరు నరసింహారావు, దండిపోగు అంజయ్య, భవాని, ప్రసాద్, గోపి, వెంకటేశ్వర్లు కుంచాల శ్రీనుకు ఎమ్మెల్యే ఏలూరి టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఆరాచక పాలన అంతానికే బొప్పూడి వద్ద ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు తలపెట్టిన ప్రజాగళం సభ అని అన్నారు. రాష్ట్రం ప్రగతి బాట పట్టే రోజులు త్వరలో ఉన్నాయన్నారు. ప్రజలంతా ఆలోచించి ఓటు వేసే ముందు సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సర్వేలన్నీ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు పట్టం కట్టనున్నట్లు అంచనా వేశాయన్నారు. జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు కౌంట్ డౌన్ మొదలైందన్నారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజు ఉదయ్‌భాస్కరరెడ్డి, రాజు విక్రంనారాయణరెడ్డి, చేజర్ల వెంకటరమణ, తెడ్డు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకపోతే సహించేది లేదు!

- అధికారులపై డీపీవో రవికుమార్ ఆగ్రహం


డీపీవోకు సమస్యలు విన్నవించుకుంటున్న పంచాయతీ కార్మికులు

ఇంకొల్లు, మార్చి 15: అధికారులు బాధ్యతగా పనిచేయకపోతే సహించేదిలేదని డీపీవో రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఇంకొల్లు వచ్చిన ఆయనకు పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమకు సక్రమంగా జీతాలు అందడంలేదని విన్నవించుకున్నారు. పెంచిన జీతాలు ఇవ్వకపోగా, నెలవారీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే పెరిగిన జీతాలు చెల్లించాలని ఈవో నాగయ్యను ఆదేశించారు. ఈసందర్భంగా డీపీవో రవికుమార్ మాట్లాడుతూ ఇంకొల్లు మేజరు పంచాయతీలో అసలేం జరుగుతోందని ప్రశ్నించారు. మేజరు పంచాయతీలో నిధుల కొరత ఏమిటి..బాధ్యతగా పని చేయకపోతే సహించేది లేదన్నారు. రూ.3 కోట్లు పన్నుల రూపంలో ఆదాయం రావాల్సి ఉండగా, కేవలం రూ.6 లక్షలు వసూలైనట్లు చూపించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఇంటి పన్నులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఈవోఆర్డీని ఆదేశించారు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

ఇంకొల్లు, మార్చి 15: ఇంకొల్లు పంచాయితీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై శుక్రవారం బాపట్ల జిల్లా డీపీవో రవికుమార్ విచారణ చేపట్టారు. గత రెండేళ్లలో సర్పంచ్ ఏజర్ల ప్రసన్న, అధికారులు సుమారు రూ. 4 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని కొంతమంది పంచాయతీ మెంబర్లు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో అప్పటి కార్యదర్శి మోహనబాబు సస్పెండు కాగా, సర్పంచ్ ప్రసన్నకు చెక్‌పవర్ రద్దు చేశారు. సర్పంచ్ ప్రసన్న చెక్‌పవర్ పునరుద్ధరించాలని జిల్లా అధికారులకు విన్నవించుకున్నారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు రవికుమార్ ఇంకొల్లు పంచాయతీ కార్యాలయంలో బాధ్యులైన అధికారులను, పంచాయితీ మెంబర్లను విచారించారు. పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఈఓఆర్డీ శ్రీనివాసరావును ఆదేశించారు. లిఖితపూర్వకంగా పంచాయతీ మెంబర్లచే జరిగిన విషయాలను స్వీకరించారు.

పూర్తి వివరాలు సేకరించి నివేదికను పై అధికారులకు అందజేస్తామని డీపీవో రవికుమార్ చెప్పారు. కొంత మంది అధికారులు, సర్పంచ్ ఈ విచారణకు హాజరుకాలేదు. డీఎల్‌పీవో హనుమంతరావు, వెంకటేశ్వరరావు విచారణలో పాల్గొన్నారు.

రొంపేరులో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు


రొంపేరులో అక్రమంగా ఎక్స్‌కవేటర్‌తో తవ్వి ట్రాక్టర్లకు నింపుతున్న మట్టి

చీరాల, మార్చి 15: చీరాల నియోజకవర్గ పరిధిలో రొంపేరులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒకరు అనుమతి పొంది తే, దాన్ని సాకుగా చూపి ఎక్స్‌కవేటర్లతో వందల సంఖ్యలో గత రెండు రోజుల నుంచి మట్టి అక్రమ తవ్వకాలు సాగిస్తుండగా, శుక్రవారం వెలుగులోకి వచ్చింది. దీన్ని డ్రైనేజీ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. రొంపేరు అక్రమ తవ్వకాలతో వరదల సమయంలో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. స్వలాభం కోసం సహజవనరులకు గండి కొట్టటం పట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రొంపేరు పరివాహక ప్రాంతంలో వేటపాలెం మండలం దేశాయిపేట సమీపంలో రొంపేరులో ఓ వ్యక్తికి 300 క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వుకునేందుకు డ్రైనేజీ వారు అనుమతి ఇచ్చారు. దీన్ని సాకుగా చూపి ఏకంగా ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు సాగిస్తూ సుమారు 40, 50 ట్రాక్టర్లతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లటంతో వారు అక్రమ తవ్వకాలు సాగుతున్న ప్రదేశానికి వెళ్లటంతో అందరూ పారిపోయారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాకు అధికారపార్టీ అండ ఉండటమే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

సహజ వనరులను నష్టపరుచుకోవటం, దోచుకోవటం అనేది వారి గొయ్యి వారే తవ్వుకున్నట్లుగా ఉందని డ్రైనేజీ ఈఈ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఓ వ్యక్తికి నిబంధనలకు లోబడి 300 క్యూబిక్ మీటర్లు తవ్వుకుని, రవాణా చేసుకునేందుకు అనుమతి ఇచ్చామన్నారు. అయితే, కొందరు ఏకంగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వి భారీ సంఖ్యలో ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారని సమాచారం వచ్చింది. ఎన్నికల విధుల్లో ఉండటంతో సంఘటనా స్థలానికి వెళ్లలేకపోయామన్నారు. పోలీసులు వెళ్లే సరికి అక్రమార్కులు పారిపోయారని చెప్పారు. శనివారం సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తామన్నారు. భవిష్యత్‌లో ఇక ఎవరికి అనుమతులు ఇవ్వమన్నారు. సహజవనరులను నష్టపరిస్తే భవిష్యత్‌లో వచ్చే ముప్పును ఎవరూ ఆపలేరని మురళీకృష్ణ పేర్కొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

పర్చూరు, మార్చి 16: త్వరలో జరగనున్న ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.రవీందర్ అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలో నియమితులైన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఏటీ కమిటీల శిక్షణ కార్యక్రమం రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఎన్నికల ప్రక్రియ, వివిధ రకాల యాప్‌ల గురించి వివరించారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించటమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, మెహర్‌బాబు, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మిరపకాయలు అపహరణ


సంతమాగులూరు , మార్చి 15: మండలంలోని ఏల్చూరు గ్రామంలోని చెక్కల వాగు రోడ్డులో ఆరబెట్టిన 15 క్వింటాళ్ల మిర్చిని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి అపహరించారని రైతు వల్లెం వెంకట్రావు తెలిపారు. 1.50 ఎకరిత పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి పంటను సాగు చేసినట్టు చెప్పారు. రెండు కోతల్లో వచ్చిన 15క్వింటాళ్ల తేజ రకం మిర్చిని కల్లంలో ఆరబెట్టినట్టు తెలిపారు. రాత్రి 11 గంటల వరకు కాపలాఉండి తరువాత ఇంటికి వెళ్ళానన్నారు.. తెల్లవారు జామున పొలం వద్దకు వెళ్లగా 15క్వింటాళ్ల మిర్చి చోరీ చేశారని బాధితుడు వాపోయాడు. 15 కింటాల మిర్చి కోయడానికి కూలీలకు రూ.50 వేల ఖర్చయిందని చెప్పారు. ప్రస్తు మార్కెట్ రేటు ప్రకారం పోయిన 15 క్వింటాళ్ల మిర్చి విలువ రూ.రెండున్నర లక్షల దాకా ఉంటుందని తెలిపారు. ఇందుకుసంబంధించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు వల్లం వెంకట్రావు తెలిపారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ వైద్యం

చినగంజాం, మార్చి 15: ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఖర్చు లేకుండా సంపూర్ణ వైద్యం అందిస్తున్నట్టు పల్లెపాలెం సర్పంచ్ సైకం మణి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం సచివాలయం వద్ద శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.

చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.విజయభాస్కరరావు, పి.సాయిశ్రీచరణ్, డాక్టర్ టి.సుందర్ 305 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి కళ్లజోళ్ళులు, మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్.సుధాకర్, బేబి, చిరంజీవి, ఉల్దారాణి, పొదిలి రాఘవ, గ్రామ కార్యదర్శి కె.నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభకు వచ్చి తప్పిపోయిన వృద్ధుడు


తప్పిపోయిన రమణయ్య

మేదరమెట్ల , మార్చి 15: వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు తమ తండ్రి వచ్చి తిరిగిరాలేదని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈనెల 10న కొరిశపాడు మండలం పి.గుడిపాడు వద్ద సిద్ధం సభకు నెల్లూరు జిల్లా కావలికి చెందిన పామంచి రమణయ్య (75) వచ్చినట్టు తెలిపారు. అప్పటినుంచి తమ తండ్రి కనిపించడం లేదని ఆమె కుమార్తెలు నలుగురు సిద్ధం సభ జరిగిన ప్రదేశం వద్దకు శుక్రవారం వచ్చారు. ఇప్పటికే కావలి పోలీస్‌స్టేషన్‌లో తమ తండ్రి తప్పిపోయినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సీఏఏ చట్టం అమలును నిలిపివేయాలి

అద్దంకిటౌన్, మార్చి 15: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ) అమలుచేసే విధానాన్ని నిలుపుదల చేయాలని సీపీఎం ప్రకాశం జిల్లా నాయకుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఏఏ అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ అద్దంకి పట్టణంలో ముస్లింలు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక భవాని సెంటర్ నుంచి బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ 2019లో చట్టం తీసుకువచ్చినప్పుడు దేశవ్యాప్తంగా దీనిని వ్యతిరేకంగా ముస్లింలు, మైనార్టీ వర్గాలు ఆందోళన ఫలితంగా చట్టాన్ని అమలు చేయకుండా నిలుపుదల చేశారని చెప్పారు. మరలా ఇప్పుడు ఎన్నికలకుముందు సీఏఏ చట్టాన్ని అమలు చేయాలని ప్రకటించడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శమన్నారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సీఏఏ చట్టాన్ని అమలు చేయమని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు బాజి, కరీమ్, రసూల్, సీపీఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు అంకం కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో కేంద్ర బలగాలు కవాతు

చినగంజాం, మార్చి 15: మండలంలోని చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలో కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చినగంజాం, రైల్వేస్టేషన్ రోడ్డు, సోపిరాల తదితర ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని ఎస్‌ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసుస్టేషన్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ఆదర్శ విద్యార్థులు

ఇంకొల్లు, మార్చి 15: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్‌లో ప్రతిభ కనబరిచిన పది మంది ఆదర్శ, శ్రీసాయిరాం విద్యార్థులను బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ అభినందించినట్లు ఆ పాఠశాలల డైరెక్టరు తోటకూర విజయభాస్కర్ తెలిపారు. రసజ్ఞ, హేమఆనంది, హరిచందన, జాహ్నవి, రాఘవేంద్ర, మేఘన, రామ్‌వర్ధన్, భగరధనాయక్ మంచి మార్కులు సాధించి సైనిక పోటీ పరీక్షకు అర్హత పొందినట్లు తెలిపారు.

ఇంకొల్లులో కాగడాల ప్రదర్శన

ఇంకొల్లు, మార్చి 15: నరేంద్రమోదీ ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ కిసాన్‌మోర్చా పిలుపు మేరకు ఇంకొల్లులో శుక్రవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ ఉద్యమం ఏడాది పాటు జరిగి హామీలను సాధించుకున్నప్పటికీ నేటికి రైతాంగానికి ఇచ్చిన హామీలను నేరవేర్చలేదని రైతుసంఘం జిల్లా నాయకుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. గ్రామ ప్రధానవీధుల్లో కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆదయ్య, బాచిన కోటేశ్వరరావు, నాగండ్ల వెంకట్రావు, హనుమంతరావు, భానుప్రసాద్, రంగారావు, గంగయ్య, లింఖన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు


కారంచేడు(పర్చూరు), మార్చి 16: కారంచేడు మండలంలో విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఏకకాలంలో 14 గ్రామాల్లో 2940 సర్వీసులను తనిఖీలు చేశారు. అదనపు లోడుతో విద్యుత్‌ను వినియోగించుకుంటున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఈఈ చీరాల వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం వంద కేసులు నమోదు చేసి రూ.ఆరు లక్షల 86వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈతనిఖీల్లో కె.జాన్ థామస్, జె.శ్రీనివాసులు, టి.శ్రీనివాసరావు, ఎన్.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

• నేడు పొట్టి శ్రీరాములు జయంతి

అమరజీవి ఆత్మార్పణే ఆంధ్రరాష్ట్రం

తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక అమరజీవి పొట్టిశ్రీరాములు. ఆయన ఆత్మార్పణ వల్లే మన ఆంధ్ర రాష్ట్రం పురుడుపోసుకుంది. దేశంలో భాషాప్రయోక్త రాష్ట్రాలకు బాటలు వేసిన ఆ మహనీయుడు నెల్లూరీయుడు కావడం మనకందరికీ గర్వకారణం. పొట్టిశ్రీరాములు కుటుంబం నెల్లూరు జిల్లాలోని పడమటిపల్లెకు చెందినది. ఇక్కడి నుంచి మద్రాసుకు వలసవెళ్లారు. 1901 మార్చి 16న మద్రాసు నగరంలో శ్రీరాములు జన్మించారు. ఆయన జీవించిన 52 సంవత్సరాల్లో తొలి 20 ఏళ్ల మద్రాసులోనే గడిపారు. చెన్నైలోనే పాఠశాల విద్యను అభ్యసించారు. ముంబైలో ఇంజనీరింగ్ చేశారు. గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. తన 25వ ఏట భార్య, కుమారుడు మరణించడంతో మహాత్మా గాంధీ సబర్మతి ఆశ్రమంలో చేరారు. బాపూజీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ నినాదాలకు ఆకర్షితుడై ఆయన ఆశయాల సాధనకు జీవితాంతం కృషి చేశారు. శ్రీరాములు అంకితభావంతో పనిచేయడాన్ని గుర్తించిన మహాత్మాగాంధీ నాకు శ్రీరాములు వంటి 11 మంది అనుచరులు ఉంటే ఒక్క సంవత్సరంలోనే బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేవాడినని వ్యాఖ్యానించారు.

1946లో శ్రీరాములు నెల్లూరుకు వచ్చారు. దళితుల సంక్షేమం కోసం పనిచేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా ఖాదీ గ్రామ పరిశ్రమలను ప్రోత్సహించారు. 1946 -1948 మధ్య దళితులకు ఆలయ ప్రవేశం కోసం నెల్లూరులోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం ఎదుట మూడు సార్లు నిరాహార దీక్ష చేసి హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించారు. 1912లోనే భాషాప్రయోక్త రాష్ట్రాలు కావాలనే డిమాండ్ దేశంలోని పలు ప్రాంతాల్లో ఉంది. దీనికితోడు ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో తెలుగు వారంటే చిన్నచూపును గుర్తించిన పొట్టిశ్రీరాములు తెలుగువారి ఆత్మగౌరవం కోసం ప్రత్యేక రాష్ట్ర సాధనను లక్ష్యంగా ఎంచుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1952 అక్టోబరు 19న చెన్నైలోని బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించారు. సాధారణంగా ప్రారంభమైన ఈ దీక్ష క్రమక్రమంగా ప్రజల్లో అలజడి రేపింది. ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ మాత్రం ఈ దీక్షను సమర్ధించలేదు.



1952 డిసెంబరు 15 అర్ధరాత్రి ఆశయ సాధనలోనే శ్రీరాములు అమరుడైనాడు. అనంతరం ప్రధానమంత్రి జవహల్‌నెహ్రూ డిసెంబరు 19న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తూ ప్రకటన చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడు జతిన్‌దాస్ తర్వాత అత్యంత సుదీర్ఘ కాలం నిరాహార దీక్ష చేసిన ఘనత పొట్టిశ్రీరాములుకే దక్కింది. అమరజీవి త్యాగఫలంతో ప్రత్యేక రాష్ట్రంలో పదవులు పొందిన ప్రజాప్రతినిధులు ఆయనను మాత్రం మరిచిపోయారు. పొట్టిశ్రీరాములుకు భారతరత్న సాధించడంలో విఫలమయ్యారు. పార్లమెంటులో అమరజీవి కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేయడం లేదనే విమర్శలున్నాయి. పొట్టిశ్రీరాములు జయంతి, వర్ధంతి రోజులను సెలవు దినంగా ప్రకటించి, ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించ డంలో అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు అభిమానులు ఆగ్రహిస్తున్నారు.

- నెల్లూరు (సాంస్కృతికం)

13 కేంద్రాల్లో ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 పరీక్ష

• రేపు నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
• పరీక్ష రాయనున్న 6,954 మంది అభ్యర్థులు



అధికారుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో లవన్న

నెల్లూరు (హరనాథపురం), మార్చి 15 : ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాలలో జరగనుంది. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరగనున్న ఈ పరీక్షకు 6,954 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. హాల్ టికెట్లుతోపాటు, ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరా లను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. ఈ పరీక్షలకు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో 0861-2331261 నెంబరుతోకాల్ సెంటర్ ఏర్పాటు చేశారు.

• పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం

ఏపీపీఎస్‌సీ గ్రూపు-1 పరీక్షను సమర్థవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్వో లవన్న చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శంకరన్ వీడియోకాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా కేంద్రాలలో మంచినీరు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయించాలని సూచించారు. అంతేగాక కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌజన్య, ఏపీపీఎస్‌సీ సెక్షన్ అధికారులు ఆరోగ్యరాణి, ఆర్. సునీత పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శనివారం) : 6.25
సహరి (ఆదివారం) : 4.53

• పార్లమెంట్ పరిధిలో 50 శాతం మంది కొత్త అభ్యర్థులు • దశాబ్ద కాలం తరువాత తెరపైకి కొత్త తరం

రాజకీయాల్లో నవశకం

నెల్లూరు రాజకీయాల్లో కొత్తశకం మొదలయ్యింది. రెండు ప్రధాన పార్టీలు ఈ ఎన్నికల్లో కొత్త అభ్యర్థులను రంగంలోకి దించాయి. నెల్లూరు పార్లమెంట్, దాని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎనిమిది మంది కొత్త ముఖాలు తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కొంటున్నాయి. 1985 తరువాత ఒకేసారి ఇంత మంది కొత్త అభ్యర్థులు రాజకీయ రణరంగంలోకి దిగడం ఇదే ప్రథమంగా తెలుస్తోంది. వైసీపీ ఆవిర్భావం సందర్భంగా 2014లో పలువురు కొత్త వ్యక్తులు ఎన్నికల బరిలోకి దిగినా ఇంత పెద్ద సంఖ్యలో లేకపోవడం గమనార్హం.



వీపీఆర్



ప్రశాంతి రెడ్డి



కావ్య



కాకర్ల సురేష్



ఇంటూరి



ఖలీల్



విజయసాయి



రాజగోపాల్‌రెడ్డి

నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, వైసీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఇద్దరూ రాజ్యసభ సభ్యులే అయినా ప్రత్యక్ష ఎన్నికల్లో తొలిసారిగా తలపడుతు న్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందిన వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి ఆరేళ్ల క్రితం రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ప్రత్యక్ష రాజకీయాల్లోకి తెలుగుదేశం అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కూడా రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు కానీ ఇప్పటివరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. అనివార్య పరిస్థితుల్లో ఆయన కూడా నెల్లూరు పార్లమెంట్ స్థానానికి పోటీలో నిలిచారు. నెల్లూరు పార్లమెంట్ జనరల్ స్థానానికి మారిన తరువాత ఎక్కువ కాలం మేకపాటి రాజమోహన్‌రెడ్డి, తాజాగా ఆదాల ప్రభాకరరెడ్డి శకం నడిచాయి. ఇప్పుడు ఈ రెండు కుటుంబాలు ఎంపీ తెరపై నుంచి తప్పుకుని, కొత్తశకం సృష్టించడానికి వీపీఆర్, వీఎస్‌ఆర్‌లు తలపడుతున్నారు.

ఉదయగిరి : గడిచిన మూడు ఎన్నికల్లో ఉదయగిరి తెలుగుదేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు శకం నడిచింది. ప్రస్తుతం టీడీపీ టిక్కెట్టు దక్కించుకున్న కాకర్ల సురేష్ శకం మొదలయ్యింది. మరోవైపు ఈ నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శకం ఈ ఎన్నికలతో ముగిసింది. వైసీపీ అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శకం మొదలయ్యింది. విశేషమేంటే ఉదయగిరిలో రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్నారు.

కావలి : గత రెండు దశాబ్దాలుగా కావలి రాజకీయాల్లో బీద, రామిరెడ్డి కుటుంబాల పెత్తనం నడుస్తోంది. వైసీపీ విషయానికి వస్తే ఇక్కడ పెద్దగా మార్పేమీ లేదు. ఈ ఎన్నికల్లో కూడా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డే పోటీ చేస్తున్నారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆ పార్టీ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జిగా, రాష్ట్ర పార్టీలో క్రియాశీల నాయకుడిగా బిజీ అయ్యారు. దీంతో ఆయన కావలి నుంచి పోటీ ఆలోచనను విరమించుకోవాల్సి వచ్చింది. ఈ పార్టీ అభ్యర్థి దగుమాటి కృష్ణారెడ్డి (అలియాస్ కావ్య కృష్ణారెడ్డి) తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

కోవూరు : సుదీర్ఘ కాలంగా కోవూరు నియోజకవర్గం ప్రధాన పార్టీల్లో పోలంరెడ్డి, నల్లపరెడ్డి కుటుంబాల ఆధిపత్యమే నడిచింది. ఈ ఎన్నికల్లో టీడీపీ తరఫున వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కోవూరు అభ్యర్థిగా బరిలో నిలిచారు. దీంతో కోవూరు టీడీపీలో వేమిరెడ్డి శకం ఆరంభమయ్యింది.

నెల్లూరు : నెల్లూరు సిటీ నుంచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ శకం ఈ ఎన్నికలతో ముగిసింది. వైసీపీ అభ్యర్థిగా మహ్మద్ ఖలీల్ తొలిసారిగా అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. మరోవైపు కొత్త అధ్యాయం సృష్టించడానికి టీడీపీ అభ్యర్థిగా పొంగూరు నారాయణ బరిలో నిలిచారు.

కందుకూరు : ఈ నియోజకవర్గంలో సుదీర్ఘ కాలం చక్రం తిప్పిన ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి శకం ఈ ఎన్నికలతో ముగిసింది. ఈసారి వైసీపీ ఈయనకు టికెట్టు ఇవ్వడానికి నిరాకరించింది. తెలుగుదేశంలో ఇంటూరి శకం మొదలయ్యింది. టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. ఇక వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ కందుకూరుకు కొత్త అయినా, కనిగిరి ఎమ్మెల్యేగా ఈయనది పాతమొహమే.

మొత్తమ్మీద 2024 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం ఎనిమిది మంది తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల బరిలో తలపడుతున్నారు. వారి వారి నియోజకవర్గాల్లో కొత్త శకాన్ని, చరిత్రను సృష్టించడానికి సన్నద్ధమయ్యారు.

మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్నా పదవ తరగతి వార్షిక పరీక్షలకు నిధుల సమస్య వేధిస్తోంది. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో విషయాన్ని బయటకు పొక్కనీయకుండా ఏర్పాట్లకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కేవలం ఇన్విజిలేటర్లు, డిపార్ట్‌మెంట్ అధికారుల విధులకు మాత్రమే నిధులు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ సిబ్బంది తెలిపారు. ఇక కేంద్రాల్లో వసతుల కల్పన కోసం తల్లిదండ్రుల కమిటీలు చందాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

• 18 నుంచి పదో తరగతి పరీక్షలు
• విడుదలకు నోచుకోని పరీక్షల గ్రాంట్
• విద్యా శాఖ విజ్ఞప్తిని పట్టించుకోని ప్రభుత్వం
• ప్రైవేట్ యాజమాన్యాలతోనే వసతుల కల్పన
• ప్రభుత్వ స్కూళ్లలో చందాల వసూలు

పరీక్షలకు పైసలెలా!?

నెల్లూరు (విద్య) మార్చి 15 : పరీక్ష ఫీజుల పేరుతో పదోతరగతి విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నా పరీక్ష కేంద్రాల్లో వసతులు మాత్రం నామమాత్రంగా ఉంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. వసతుల కల్పనకు, పరీక్షల విధులకు ఖర్చు చేయాల్సిన నిధులు తూతూమంత్రంగా వెచ్చిస్తూ పరీక్షల విభాగం ఉన్నతాధికారులు, సిబ్బంది లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలక మైన వార్షిక పరీక్షలకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.125 (ఎలాంటి రుసుము లేకుండా) వసూలు చేశారు. ఫీజులు ఆలస్యంగా చెల్లించే వారి నుంచి అపరాధ రుసుము పేరుతో మరి కొంత అదనంగా కట్టిం చుకున్నారు. ఇలా రూ.80 లక్షలకుపైగా పరీక్ష ఫీజుల వసూలు చేయగా, మరో 5లక్షల వరకు అపరాధ రుసుము వచ్చినట్లు సమాచారం. జిల్లాలో ఈ ఏడాది 34,078 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతుండగా, 176 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశారు. వసూలైన నిధులతో పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు విధుల నిర్వహణలో ఉన్నవారికి భత్యం చెల్లించాలి. అయితే వసూలు చేసిన మొత్తంలో నుంచి కనీసం 10శాతం కూడా వెచ్చించడం లేదన్నది వాస్తవం.

• ఖర్చంతా కాగితాల్లోనే..

ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థుల నుంచి ఫీజుల పేరుతో రూ.లక్షలు వసూలు చేస్తోంది. అయితే, పరీక్షల సమయంలో తూతూమంత్రంగా నిధులు విడుదల చేస్తూ అత్యధికంగా ప్రైవేట్ స్కూళ్లపై బాధ్యతలు మోపుతు న్నారు. కానీ ప్రభుత్వానికి అందించే లెక్కల్లో మాత్రం రూ.లక్షలు వెచ్చించినట్లు చూపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒక్కో విద్యార్థికి చొప్పున వసతుల నిమిత్తం నిధులు కేటాయిం చాలి. అలాగే, స్టేషనరీ, గుడ్డసంచులు, ప్రొఫార్మాలు, కట్టర్, బోల్డ్ మార్కర్‌లు, పాల థీన్ కవర్లు, గమ్, పెట్టెలకు తాళాలు, సూది, దారం, స్కేల్, లక్క, ఇతర స్టేషనరీ కోసం నిధులు ఖర్చు చేయాలి.

గతంలో ఒక్కో విద్యార్థికి కేవలం రూ.2 మాత్రమే చెల్లించేవారు. దీన్ని 2016లో రూ.5, 2019లో రూ.8లకు పెంచారు. ఈ ఏడాది దీన్ని రూ.12లకు పెంచాలని ప్రతిపాదనలు పంపినా పాత పద్ధతిలోనే చెల్లించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక పరీక్ష కేంద్రంలో వందమంది విద్యార్థులు ఉంటే వసతుల కల్పనకు రూ.800 చొప్పున చెల్లిస్తు న్నారు. జిల్లాలోని 176 కేంద్రాల్లో పరీక్షలు జరగనుండగా ఆయా కేంద్రాల సామ ర్థ్యాన్ని బట్టి కేటాయింపులు చేస్తున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి నిధులు కూడా వెచ్చించాలి. అయితే, ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పరీక్షలు నిర్వ హించే సెంటర్లను ప్రైవేట్ స్కూళ్లలో అధికంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్ సెంటర్లలో వసతులన్నీ కూడా ఆయా పాఠశాలల యాజమాన్యాలే భరించాల్సి ఉంటుందని, కానీ లెక్కల్లో మాత్రం నిధులు వెచ్చించినట్లు చూపు తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు రూ.80లక్షలు విడుదల చేయాలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఇప్పటికీ ఎలాంటి ఉత్తర్వులు వెలువడ లేదు. దీంతో విద్యాశాఖ అధికారులు ఇతర శాఖల నుంచి నిధులు విడుదల చేయించుకునే పనిలో నిమజ్ఞమై ఉన్నట్లు ఆ శాఖ సిబ్బందే చెప్పడం విశేషం.



ఎన్నికలకు సర్వం సన్నద్ధం!

నేడు షెడ్యూలు ప్రకటించనున్న కమిషన్
ఆ వెంటనే కోడ్ అమలులోకి..

నెల్లూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికలు రానే వచ్చాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ శనివారం మధ్యాహ్నం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనుండగా, ఆ వెంటనే కోడ్ అమలులోకి రానుంది. జిల్లాలో మూడు నెలలుగా ఎన్నికల వాతావరణం నెలకొనగా, ప్రధాన పార్టీలు బరిలో నిలిచే అభ్యర్థులను సైతం ప్రకటించేశాయి. ఈ మేరకు ప్రచారాన్ని కూడా మొదలుపెట్టేశారు. ఈ నెల ఆరంభం నుంచే ఇటు రాజకీయ నాయకులు అటు ప్రజలు ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తూ వచ్చారు. 2019లో మార్చి 10వ తేదీన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగా, ఈసారి ఒక రోజు అటూ ఇటుగా షెడ్యూల్ ప్రకటిస్తారని అంతా ఊహించారు. గతంతో పోల్చితే ఆరు రోజులు ఆలస్యంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నిక కమిషన్ షెడ్యూల్ విడుదల చేయనుంది. ఆ మరుసటి నిమిషం నుంచే దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. 2019లో తొలివిడతలో అంటే ఏప్రిల్ 11వ తేదీన రాష్ట్రంలో పోలింగ్ జరిగింది. ఈసారి కూడా తొలిఫేజ్‌లోనే ఎన్నికలు జరుపుతారా!? లేదా అన్నది నేడు స్పష్టం రానుంది.

• అన్ని ఏర్పాట్లు పూర్తి

ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసుకుంది. 19,13,549 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకు అవసరమైన 2,317 పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. పోలింగ్ కేంద్రాల వద్ద కావాల్సిన ఏర్పాట్లు, ఈవీఎంల పరిశీలన పూర్తయ్యింది. దశలవారీగా ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ యంత్రాంగం సన్నద్ధమయ్యింది. కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకొని నియోజకవర్గ కేంద్రాల్లో కవాతు నిర్వహించాయి. పోలింగ్ నాటికి మరిన్ని బెలాలియన్లు, ఆర్మ్‌డు ఫోర్స్ జిల్లాకు చేరుకోనుంది. రాజకీయ పార్టీలు బూత్‌లెవల్‌లో ఏజెంట్లను నియమించుకున్నాయి. టీడీపీ 2,263, వైసీపీ 2,225 మంది బీఎల్‌ఏలను నియమించుకున్నాయి.

అంగన్‌వాడీలపై కేసులు ఉన్నాయా!?

• వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశాలు

ఉదయగిరి రూరల్, మార్చి 15: జిల్లావ్యాప్తం గా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై పోలీస్ స్టేషనులో కేసులు నమోదై ఉన్నాయా!? అని రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రాజెక్టు కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందడంతో ఆ వివరాల సేకరణలో అధికారులు ఉన్నారు. ఒకవేళ అంగన్‌వాడీలపై కేసులు నమోదై ఉంటే సదరు ఎఫ్ఐఆర్ కాపీలతోపాటు సమగ్ర వివరాలు పంపాలంటూ సూచించింది. అందులో భాగంగా సీడీపీవోలు కేసుల వివరాలను ఆరా తీసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నారు. జిల్లాలో 12 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, 2,673 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2,665 మంది సహాయకులు విధులు నిర్వహిస్తున్నారు. తమ డిమండ్ల సాధన కోసం గతేడాది డిసెంబరు 12 నుంచి జనవరి 21వ తేదీ వరకు అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రాజెక్టు, తహసీల్దారు కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు తదితర ప్రాంతాల్లో ఆందోళన చేపట్టడంతోపాటు ప్రజాప్రతినిధుల నివాసాలను ముట్టడించారు. ఈ క్రమంలో చాలా మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. కేసుల పేరుతో ఎన్నికల్లో వారిని ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉదయగిరి సీడీపీవో లావణ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఏమైనా కేసులు ఉన్నాయా, ఉంటే నివేదికలు పంపాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అయితే, తమ ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి కేసులు నమోదు కాలేదని, ఈ సమాచారాన్ని అధికారులకు నివేదించినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ

• నామినేషన్ కేంద్రాల్లోకి నలుగురికే అనుమతి
• ఈఆర్‌ఓలు, పోలీసు అధికారుల సమావేశంలో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 15 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏవిధమైన ఫిర్యాదులు రాకుండా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో లైన్లు ఏర్పాటు చేయాలని, అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల నిర్వహణలో డీఎస్పీలు పటిష్ఠవంతంగా పనిచేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, కందుకూరు రిటర్నింగ్ అధికారి విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎప్పుడు కలుస్తామో...!

• మదినిండా బాధతో స్నేహితుల వీడ్కోలు
• పూర్తయిన ఇంటర్మీడియట్ పరీక్షలు
• రోడ్లపై కాగితాలు విసిరేస్తూ కేరింతలు
• కిటకిటలాడిన బస్టాండ్, రైల్వేస్టేషన్లు

ఇన్నాళ్లూ కలిసి మెలిసి చదువుకున్న ఆ విద్యార్థులంతా మదినిండా బాధతో వీడ్కోలు చెప్పుకున్నారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శుక్రవారంతో పూర్తయ్యాయి. పరీక్ష కేంద్రాలు, కళాశాలల వద్ద విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. ఓవైపు పరీక్షలు పూర్తయ్యాయన్న ఆనందం.. మరోవైపు మిత్రులం విడిపోతున్నా మనే బాధ వారిలో కనిపించిం ది. బరువెక్కిన గుండెతో మళ్లీ ఎప్పుడు కలుస్తాం నేస్తమా అంటూ ఒకరినొకరు ఆత్మీయంగా అలింగనం చేసుకున్నారు. దూర ప్రాంతాలు, పల్లెల నుంచి చదువు నిమిత్తం నగరానికి, పట్టణాలకు వచ్చిన విద్యార్థులు రెండేళ్లపాటు హాస్టళ్లలో ఉండి కలిసి చదువుకున్నారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్వగ్రామాలకు పయనమయ్యారు.



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు



సర్వోదయ కళాశాల సమీపంలో ఇంటర్ విద్యార్థుల సందడి



పక్షం రోజులుగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. చివరి పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. స్నేహితులతో కలిసి చిందులు వేశారు. హోటళ్ల, ఐస్‌క్రీమ్ పార్లర్లు, సినిమా హాళ్లకు వెళ్లారు. కాగితాలు చింపి బస్సుల్లో నుంచి రోడ్డుపై విసిరేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్ పరీక్షలు పూర్తవడంతో ఇతర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు స్వస్థలాలకు పయనమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శుక్రవారం ద్వితీయ సంవత్సరం వారికి జనరల్ కెమిస్ట్రీ-2, కామర్స్-2, ఒకేషనల్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 22,319 మందికిగాను 21,819 మంది హాజరుకాగా 500 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 461 మందికి 360 మంది హాజరుకాగా 101 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 22,780 మంది విద్యార్థులకు 22,179 మంది హాజరయ్యారు. 601 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల నిర్వహణ తీరును ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీవీఈవో మధుబాబు, డీఈసీ సభ్యులు, స్క్వాడ్ కలిపి 43 కేంద్రాలను పరిశీలించారు. ఇదిలా ఉండగా, ఇంటర్ విద్యార్థులకు ప్రధాన పరీ క్షలు పూర్తయిన ప్పటికీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ బ్రిడ్జి కోర్సు, మోడర్న్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు జరగాల్సి ఉంది.

- నెల్లూరు (విద్య)

జెండా మోసే ప్రతి ఒక్కరికీ అండగా ఉంటా

● ఆత్మీయ సమావేశంలో ఉదయగిరి టీడీపీ అభ్యర్థి కాకర్ల


కొండాపురం: కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

కొండాపురం, మార్చి 15: టీడీపీ జెండా మోసే ప్రతికార్యకర్త, నాయకులు, అభిమానులను అండగా ఉంటానని ఉదయగి టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ భరోసా ఇచ్చారు. శుక్రవారం పార్లపల్లిలో టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో రెండేళ్లుగా దాదాపు లక్ష కుటుంబాలను కలశానని, సుమారు 45 వేలమందికి కాకర్ల ట్రస్టు ద్వారా పలు రకాల సేవలందించానన్నారు. ఎన్టీఆర్ సంజీవని ఆరోగ్యరథం 29వేల మందికి వైద్య పరీక్షలు, అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందించానన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆదరిస్తే మరింత సేవ చేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. అంతకుముందు మండల పార్టీ నాయకులు కాకర్ల సురేష్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్.వెంకటాద్రి, నెల్లూరు పార్లమెంటు అధికారప్రతినిధి యారవ క్రిష్ణయ్య, రైతు కార్యదర్శి పీ.రమేష్, నాయకులు నర్రా చెంచునాయుడు, గద్దె రాఘయ్య, పీ.తిమోతి, షేక్.ఖాసిం, సీహెచ్.క్రిష్ణ పాల్గొన్నారు.

వరికుంటపాడు: ప్రస్తుత పాలనలో అప్పుల ఆంధ్రను కాపాడి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు జనసేన, బీజేపీలతో పొత్తు నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. మండలంలో దౌర్జన్యంగా భూములు లాక్కోవడం, అరాచకాలు సృష్టించిన వారిని సంగతి తనకు తెలుసన్నారు. పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని వారందరి అకౌంట్లు త్వరలోనే సెటిల్ చేస్తానని చెప్పారు. మాజీ శాసన సభ్యులు బొల్లినేని వెంకటరామారావు ఆశీస్సులతో ఆయన అడుగు జాడల్లోనే నడుస్తానన్నారు. తాజా, మాజీ శాసన సభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ చంచలబాబుయాదవ్‌ల సహకారంతో ముందుకు సాగుతానన్నారు. అనంతరం అధికార పార్టీకి చెందిన గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలను పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. మండల కన్వీనర్ చంద్ర మధుసూ దనరావు, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, కాకర్ల సునీల్, ముజ్జె లక్ష్మీనారాయణ, పోలిబోయిన శ్రీకాంత్, పోకా మహేష్, నాదిండ్ల రాజేంద్ర, చంద్ర వెంకయ్య పాల్గొన్నారు.

సోమశిలలో 12.710 టీఎంసీల నిల్వ

అనంతసాగరం: సోమశిల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారం నాటికి జలాశయంలో 12.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1600, ఉత్తరకాలువకు 600, దక్షిణకాలువకు 450క్యూసెక్కులు సరఫరా అవుతున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా ఖాజారహమతుల్లా

ఏఎస్ పేట, మార్చి15: కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా గండువారిపల్లి షేక్ ఖాజారహమతుల్లాను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. శుక్రవారం జిల్లా నాయకుల నుంచి తనకు నియామకపత్రం వచ్చినట్లు తెలిపారు. తనకు ఈ అవకాశాన్ని కల్పించిన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేవూరు శ్రీధర్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

స్వతహాగా ఓటు వేయండి


కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మర్రిపాడు, మార్చి 15: ప్రతిఒక్కరూ స్వతహాగా తమ ఓటును వినియోగించుకోవాలని ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం కేంద్రబలగాలతో మర్రిపాడు, తిక్కవరం, పల్లవోలులో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా, పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్త్ ఏర్పాటు చేయనున్నట్లు, ఓటర్లకు ధైర్యాన్ని కల్పించేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఉదయగిరి రూరల్, మార్చి 15: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం సంఘబంధం సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం ఖాజారంతుల్లా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రైతు సాధికారిత సంస్థ సహకారంతో సంఘం అనుబంధ సభ్యులతో పురుగు మందులు లేకుండా సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులను సీసీలు పర్యవేక్షిస్తుండాలన్నారు.

బైపాస్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి రాఘవేంద్ర కల్యాణ మండపం వరకు పట్టణంలోకి వచ్చే బైపాస్‌రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నేతలు డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు లక్కు క్రిష్ణప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, వాగాల శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ

చేజర్ల, మార్చి 15: ఆదురుపల్లి త్రికోటేశ్వర విద్యాలయంలో శుక్రవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరక్టర్ ఎం.సుధాకరరెడ్డి, కే.లక్ష్మీనరసారెడ్డి పాల్గొన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రహదారిపైనే మురుగు..


ఉదయగిరి సుద్దబావి వీధిలో రోడ్డు దుస్థితి

ఉదయగిరి రూరల్: పట్టణంలోని సుద్దబావివీధిలో రహదారిపై మురుగు పారుతుండటంతో అడుగు వేసేందుకు పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు వెళ్లేందుకు కాలువ లేకపోవడంతో రహదారిపై ప్రవహిస్తోంది. దీనికితోడు అక్కడ మురుగు నిల్వ చేరి దుర్వాసనతో పాటు దోమలకు నిలయంగా మారుతోందని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించినా ఫలితం లేదని మండిపడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు రహదారిపై రాకుండా చూడాలంటున్నారు.

జండాదిబ్బలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ

సంగం, మార్చి 15: ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు జండాదిబ్బలో ఇంటింటికి తిరిగారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


దుత్తలూరు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), : స్థానిక కమ్మవారిపాలెం సొసైటీ పీఏసీఎస్ ఆధ్వర్యంలో తెడ్డుపాడు, భైరవరం, నర్రవాడ రైతుభరోసా కేంద్రాల్లో శుక్రవారం అధికారులు ధాన్యంను కొనుగోలు చేశారు. ఆయా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదు చేసు కొన్న రైతులు కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటాల్ రూ.2,203, పుట్టి రూ.18,752, సాధారణ రకం క్వింటాల్ రూ.రూ.2,183, పుట్టి రూ.18,555లకు కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ఆర్.యశోద, వ్యవసాయాధికారి ఎన్.వెంకటసుబ్బారెడ్డి, సీఈవో లోక్‌నాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఈద్గాలో అభివృద్ధి పనులు ప్రారంభం


ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఉదయగిరి రూరల్: మండల నిధులతో ఈద్గా మసీద్ మౌలానా సయ్యద్ అఫ్రోజ్ శుక్రవారం స్థానిక ఈద్గా మైదానంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. బోరుతో పాటు ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. రంజాన్ మాసం ముగిసేలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మసీద్ కమిటీ సభ్యులు ఎంపీపీ మూలె పద్మజకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, ఎంపీటీసీ పెదమస్తానీ, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ యస్థాన్, ఉప్పుటూరి శ్రీనివాసులు, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీపీఆర్‌ను కలిసేందుకు తరలిన టీడీపీ శ్రేణులు


నెల్లూరుకు తరలిన టీడీపీ శ్రేణులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 15: నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని కలిసేందుకు దుత్తలూరు నుంచి శుక్రవారం టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. దుత్తలూరు అన్నంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దుత్తలూరు సెంటర్‌లో బాణసంచా పేల్చి వేమిరెడ్డి, కాకర్ల సురేష్ జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలని, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఘన విజయం సాధించాలని ఆలయాల్లో పూజలు చేశారు.

నేడు ఆత్మకూరులో ఆనం ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శనివారం మధ్యాహ్నం 3:30గంటలకు ఆత్మకూరు నియోజకవర్గ తెలుగు యువత, ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి, ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని టీడీపీ నేతలు తెలిపారు.

చేజర్ల: ఆత్మకూరు రవితేజ కళ్యాణ మండపంలో ప్రొఫెషనల్స్ కనెక్ట్ విత్ లీడర్ కార్యక్రమానికి మండంలోని ఐటీ ఉద్యోగులు మరియు గ్రాడ్యుయేట్స్ తప్పకుండా హాజరు కావాలని తెలుగు ప్రొఫెషనల్స్‌వింగ్ సభ్యులు తెలిపారు. ముఖ్య అతిథిగా మాజీమంత్రి, ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొంటారని చెప్పారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు


ఉదయగిరి: పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, మార్చి 15: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శుక్రవారంతో ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక ఏఆర్ఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 1న ప్రారంభమైన ఇంటర్ ప్రథమ, 2న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చివరి పరీక్ష ముగియడంతో విద్యార్థులు ఆనందంగా స్వగ్రామాలకు తరలివెళ్లారు. చివరిరోజు 225మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఆరు మంది గైర్హాజరైనట్లు పరీక్షల సిబ్బంది తెలిపారు.

సంగం : స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. దీంతో విద్యార్థులు చివరి పరీక్ష పూర్తయి పరీక్ష హాలు నుంచి బయటకు రాగానే కేరింతలు కొడుతూ హర్షం వ్యక్తం చేశారు. గురువారమే మొదటి సంవత్సర పరీక్షలు పూర్తవడంతో కళాశాలలోని బాలికలు ఇళ్లకు పయనమయ్యారు. దీంతో కళాశాల వద్ద సందడి నెలకొంది.

సీసీ రోడ్ల పనులకు భూమిపూజ


పూజ చేస్తున్న వెంకటనారాయణరెడ్డి

వరికుంటపాడు: గణేశ్వరాపురంలో రూ.20లక్షలతో చేపట్టిన 8పనులను శుక్రవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ బాదం వెంకటనారాయణరెడ్డి భూమి పూజ చేశారు. కాంచెరువులో రూ.17లక్షలతో నిర్మించే ఐదు రోడ్లకు సర్పంచ్ మందలపు మల్లేశ్వరి, గువ్వాడిలో రూ.10లక్షలతో నిర్మించే రెండు రోడ్లకు సర్పంచు శేషం నాగభూషణం శంకుస్థాపన చేపట్టారు. సర్పంచు వడ్లపల్లి తిరుపతయ్య, సుబ్బ రాయుడు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వింజమూరు: మండలకేంద్రంతో పాటు తక్కెళ్లపాడులో సీసీరోడ్ల పనులకు శుక్రవారం సర్పంచ్ రొడ్డా వెంగమ్మ భూమిపూజ చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు కొండయ్య, ఎంపీటీసీ సభ్యులు గువ్వల మల్లికార్జున్, నాయకులు కొండపల్లి రమేష్, మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి, కొండలరావు, రమణయ్య పాల్గొన్నారు. వింజమూరు పర్యటించి ఉపాధి కూలీలతో ముచ్చటించారు. రేవు నూరి శ్రీనివాసులురెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ సృజన ఉన్నారు.

చేయూత చెక్కుల పంపిణీ

కలువాయి, మార్చి 15: స్థానిక ఉమామహేశ్వరి కల్యాణమండపంలో శుక్రవారం వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, ఎంపీఎం స్రవంతి, ఎం.కృష్ణారెడ్డి, మాదాను యజ్ఞపవన్ పాల్గొన్నారు.

ఉదయగిరి: నెల్లూరు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని శుక్రవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి వైసీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో శకునాలపల్లి సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర్‌రెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): కొత్తపేటలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు హరీష్, వెంకటసందీప్, అవినాష్, కోటేశ్వరరావులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారు. ఎంపీడీవో సాయిప్రసాద్, ఆరోగ్య పర్యవేక్షకులు షేక్ రియాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

జామాయిల్ తోట దగ్ధం

కందుకూరు: మున్సిపాలిటీలోని దూబగుంట సమీపంలో పీ.చెన్నయ్యకు చెందిన జామాయిల్ తోట శుక్రవారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. తోటలో ఉన్న తుక్కుకుని వ్యంటుకోవడంతో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. తానంటే గిట్టనివాళ్లు నిప్పుపెట్టి ఉంటారని చెన్నయ్య ఆరోపించారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం!

● తలుపులు తెరుచుకోని కేంద్రాలు ● పల్లెలో అందని వైద్యం


కొండసముద్రంలో మూసి ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్

వలేటివారిపాలెం, మార్చి 15 : గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పల్లెలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గ్రహణం పట్టింది. మండలంలో 14 విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఆశా కార్యకర్తలను నియమించారు. ఆ కేంద్రాల్లో 12 రకాల వైద్య సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించాల్సి ఉంది. అందులో గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. అయితే వారికి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆరోగ్య సిబ్బంది గ్రామాలకు చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని కేంద్రాలైతే తలుపులు కూడా తీయడంలేదు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, తీవ్ర అనారోగ్యంతో లేవలేని స్థితిలో ఉన్నవారు ఉంటే వారి ఇంటికి వెళ్లి వైద్యం అందించాల్సి ఉండగా అది ఎక్కడా అమలు కావడం లేదు. ఆరోగ్య సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడడంతో పల్లెల్లో వైద్యం అందని ద్రాక్షాలా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ కేంద్రాలపై దృష్టి సారించి గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

యువత బంగారు భవితకు చంద్రబాబు సీఎం కావాలి

● విద్యార్థులతో వీపీఆర్, కావ్య ముఖాముఖి


మాట్లాడుతున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి వీపీఆర్

కావలి, మార్చి 15: యువత బంగారు భవిష్యత్‌కు బాటలు పడాలంటే ఒక విజన్ ఉన్న నేత నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం టీడీపీ కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి హైద్రాబాద్‌లో హైటెక్ సిటీని నిర్మించింది చంద్రబాబు నాయుడన్నారు. అక్కడ ఎంతో మంది యువతకు ఉపాధి అవకాశాలు కలగటం ఆయన పుణ్యమన్నారు. విద్యార్థులు తమ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఈ వయస్సులో మంచి మార్గదర్శితో ముందుకు సాగితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులంతా వజ్రాయుధం లాంటి ఓటు అనే ఆయుధంతో మీ తొలి ఓటు ఎంపీ అభ్యర్థిగా తనకు, ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్యకు వేయాలన్నారు. అనంతరం కావలి టీడీపీ కార్యాలయంలో జరిగిన పరిచయ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని టీడీపీ, జనసేన నేతలకు కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మాలేపాటి సుబ్బానాయుడు, రూపుకుమార్ యాదవ్, పోతుగంటి అలేఖ్య, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి, గుత్తికొండ క్రిషోర్ పాల్గొన్నారు.

తలనీలాల ద్వారా రూ.1,44,99,999 రాబడి


మాలకొండలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, మార్చి 15 : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. దీని ద్వారా రూ.1,44,99,999 రాబడి వచ్చింది. మాలకొండ కళ్యాణ మండపంలో కందుకూరు గ్రూప దేవాలయం కార్యనిర్వాహణాధికారి వై బైరాగి పర్యవేక్షణలో జరిగిన వేలంలో తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధి రూ.1,44,99,999లకు దక్కించుకున్నారు. అయితే గత ఏడాది తలనీలాలు వేలం పాట రూ.2,16,99,999 పలకగా ఈ ఏడాది రూ.72 లక్షలు తగ్గింది. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉప కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి కేబీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ, శ్రీశైలం, పెంచలకోన తదితర పుణ్యక్షేత్రాలలో కూడా తలనీలాలు వేలం పాటల ద్వారా ఆదాయం సగానికి పైగానే పడిపోయినట్లు తెలిపారు. మార్కెట్‌లో తలనీలాలకు డిమాండ్ లేనందున వ్యాపారులు తలనీలాలు పాటను పాడేందుకు ముందుకు రావడం లేదన్నారు. తిరుపతి, శ్రీశైలం, కనకదుర్గమ్మ, పెంచలకోన తదితర దేవాలయాలలో తలనీలాలు వేలం పాట తక్కువగా వస్తునందున వ్యాపారులు అటు వైపు మొగ్గు చూపుతున్నట్లు చెప్పారు. తిరుపతిలో ఇప్పటి వరకు 2 లక్షల కేజీలకు పైగానే తలనీలాలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కందుకూరులో టీడీపీ విజయం తథ్యం : ఇంటూరి


వలేటివారిపాలెం : నాగేశ్వరావును అభినందిస్తున్న శిఖామణి

కందుకూరు, మార్చి 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కందుకూరులో టీడీపీ విజయం తథ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇప్పటికే ప్రజలు విసుగుచెందారని రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కేవలం చంద్రబాబునాయుడు వల్లనే సాధ్యమన్నారు. పరిశ్రమలు ఏర్పాటు, రాళ్లపాడు ఆయకట్టు రైతులకు సక్రమంగా నీరందించడం, రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు న్యాయం చేయడం లక్ష్యమన్నారు. కందుకూరుకు కొత్తగా వచ్చిన వ్యక్తి శాంతిభద్రతల గురించి ఏవేవో మాట్లాడుతున్నాడని, అలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుంటే మంచిదన్నారు. నాకు ఇన్‌చార్జి పదవి, తాజాగా అభ్యర్థిత్వం ఖరారు కావడంలో సహరించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాంకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడి, టికెట్ కోసం పోటీపడ్డ సోదరుడు ఇంటూరి రాజేష్‌తో కలసి త్వరలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. ఈ సమావేశంలో కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను విజయవంతం చేయండి : ఈనెల 17న బొప్పూడి సమీపంలో జరగనున్న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

నాగేశ్వరావుకి అభినందన

వలేటివారిపాలెం : టీడీపీ కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు ఎంపికపై హర్షం వ్యక్తం చేసిన తెలుగు యువత మండల అధ్యక్షులు బద్దిపూడి శిఖామణి శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా వేసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాగేశ్వరావుపై నమ్మకంతో టికెట్ కేటాయించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

స్థలం విషయంలో వివాదం

లింగసముద్రం, మార్చి 15 : మండలంలోని పెదపవనిలో ఓ స్థలం విషయమై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం ఓ వర్గానికి చెందిన కొందరు ఆ స్థలంలోకి వచ్చి ఈ స్థలం తమదంటూ ఓ బోర్డు ఏర్పాటు చేశారు. ఎక్స్‌కవేటర్ ద్వారా ఆ స్థలాన్ని బాగు చేసేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన మరో వర్గం వారు ఈ స్థలం తమదని, ఇందుకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా ఉన్నాయని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. విషయం తెలుసుకున్న తహసీల్దారు జీ.శ్రీచరణ్, డీటీ టీ.ప్రసాద్, కందుకూరు సీఐ షేక్ నసీఫ్‌బాషా, గుడ్లూరు ఎస్సై లక్ష్మణ్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి ఇరువర్గాలను శాంతింపజేశారు. డాక్యుమెంట్లను పరిశీలించారు. స్థలం వివాదం సివిల్ కోర్టులో పరిష్కరించుకో వాలని సూచించారు.

జోరుగా టీడీపీ ఇంటింటి ప్రచారం

బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీ, జక్కేపల్లి గూడూరు అరుంధతివాడలో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్‌చౌదరి, దగ్గుమాటి వేణుగోపాల్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు రామోహన్‌రెడ్డి, నాటకరాణి శీనయ్య, రంగయ్య, కే.వెంకటేశ్వర్లురెడ్డి, పీ.క్రిష్ణారెడ్డి, మాజీ సర్పంచు టీ.క్రిష్ణయ్య, వై.వేంకటేశ్వర్లురెడ్డి, మల్లికార్జున సుబ్బారెడ్డి పాల్గొన్నారు. బోగోలులో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్ఎస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ యాదవ్, ఎం.శ్రీనివాసులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

317 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మార్చి 15: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 332 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 317 బేళ్లు కొనుగోలు చేశారు. సీఆర్-4, జంపింగ్ లాట్స్-11 వంటి కారణాలతో 15బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.230, కనిష్ఠ ధర రూ.230, సగటు ధర రూ.230గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

సంక్షేమ పథకాలతోనే అభివృద్ధి : ఎంపీ బీద

అల్లూరు, మార్చి 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలతో రాష్ట్రాభివృద్ధి జరిగిందని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ నేరుగా లబ్ధి చేకూరే విధంగా జగనన్న పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు. అనంతరం లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, కావలి ఏఎంసీ మాజీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, నీలం సాయికుమార్, బీద రమేష్, మేడా శ్రీనివాసులు రెడ్డి, సూరిశెట్టి వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బోగోలు ఎస్ఐగా బోజ్య



బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలం తిప్ప పోలీస్ స్టేషన్ ఎస్సైగా కే.బోజ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ శేఖర్ బాబు సీఐగా పదోన్నతిపై బదిలీ కావడంతో నెల్లూరు రూరల్ స్టేషన్‌లో పనిచేస్తున్న కే.బోజ్య ఇక్కడకు బదిలీ చేశారు. రాన్నున సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరిగేందుకు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

వలంటీర్లు రాజకీయాలు చేస్తే జైలుకే..

కావలి, మార్చి 15: గ్రామాల్లో, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో వలంటీర్లు రాజకీయాలు చేస్తున్నారని, వారిపై ఫిర్యాదు చేస్తే జైలుకుపోక తప్పదని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. కావలి జర్నలిస్టుక్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వలంటీరుల జోక్యం ఉండకూడదన్న ఆదేశాలను తుంగలో తొక్కి అధికారపార్టీ ఇచ్చిన తాయిలాలను ప్రజలకు అందించి మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. వైసీపీకి ఓట్లు వేయకపోతే ఇబ్బందిపడతారని సంక్షేమ పథకాలు రావని బెదిరిస్తున్నారన్నారు. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ప్రజలకు ఇలాంటి బెదిరింపులు చేస్తున్నారన్నారు. ప్రజాసేవకన్నా అధికారపార్టీ సేవకే వలంటీర్లు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కేసులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో నేతలు జరుగుమల్లి విజయరత్నం, చౌటూరి లక్ష్మయ్య, ముక్కు మోహన్‌రావు, కంకణాల ఏడుకొండలు, జడ్డా వాసు, జనార్దన్‌రావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్, మార్చి 15: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు జగనన్న చేయూత 4వ విడత చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మండలంలోని 7,476 మంది లబ్ధిదారులకు రూ.14.01 కోట్లు జమ చేశారన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు, ఎమ్పీడీవో కార్యాలయ ఏవో శ్రీధర్, మున్సిపల్ ఇన్‌చార్జి డీఈ సాయిరాం, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ మధుసూదన్‌రావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జీ.తెరీసా, వైసీపీ నేతలు గ్రంధం ప్రసన్నాంజనేయులు, నాగన్నగారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మజ్జిగ చలివేంద్రాలు

బిట్రగుంట, మార్చి 15: బోగోలు మండలంలోని మూడు ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు బెంగళూరుకు చెందిన పారిశ్రామిక వేత్త సంజయ్ రవి కొండ దాతృత్వంతో వేసవిలో మజ్జిగ అందజేసేందుకు మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించారు. శుక్రవారం కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాలలో మజ్జిగ చలివేంద్రాన్ని ఎంఈవోలు నరసింహారావు, జయమలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతు సరస్వతి నమస్తుభ్యం వ్యవస్థాపకుడు, ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాద్‌రావు దాతల సహకారంతో పాతబిట్రగుంట, కడనూతల, కొండబిట్రగుంట లలో ఏర్పాటు చేయించిన చలివేంద్రాలు వేసవి సెలవులు ఇచ్చేంత వరకు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం కనకారావు, ఉపాధ్యాయులు శ్రీఆచారి, డీ.విజిత, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం

అల్లూరు, మార్చి 15 : మన ఓటు మనమే వేసుకుందాం అనే నినాదంగా కావలి అసెంబ్లీ స్థానం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు తెలిపారు. అల్లూరులో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బహుజన వర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్‌ను స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిపించేందుకు పనిచేయాలని అనుకున్నామని, కానీ తమ వర్గం నాయకులు మా ఓటు మనమే వేసుకుందామని కోరడంతో తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. ఎటువంటి విభేదాలు లేకుండా పసుపులేటి సుధాకర్ అనుచరుడిగా ఉన్న తాను స్వచ్ఛందంగా వైదొలిగానన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు ప్రసన్న గణపతి, కోవూరు బాబు, కావూరి బంగారయ్య, గాలి వేణుగోపాల్, నక్కా గిరి, కప్పల నవీన్‌కుమార్, ఎల్లు సుబ్రహ్మణ్యం, దానం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరా విజయలక్ష్మి

కావలిటౌన్, మార్చి 15: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమ ఇతులైన అమరా విజయలక్ష్మి శుక్రవారం కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాజీ మంత్రి వేలంపల్లి శ్రీనివాస్‌ల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో అమరా వేదగిరి, ఆయన సతీమణి విజయలక్ష్మి దంపతులకు ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు మామిడి రామకృష్ణ, డాక్టర్ శ్రీరాం మనోహర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి తదితర ఆర్యవైశ్య ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.


విజయలక్ష్మి,వేదగిరి దంపతులను సన్మానిస్తున్న నేతలు

పది పరీక్షలకు ఫోన్ తెస్తే సస్పెన్షన్

- ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పరీక్ష జరిగే రోజుల్లో ఇతర తరగతులకు సెలవు

ఒంగోలు(విద్య), మార్చి 15 : జిల్లాలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. జిల్లాలో 170 కేంద్రాలను అధికారులు నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించారు. పరీక్షలు నిర్వహించే చీఫ్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, స్క్వాడ్‌తో సహా ఇతర అధికారులందరికి నిబంధనలు వర్తిస్తాయి. ఎవరూ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకరాకూడదు. ఇక తనిఖీలకు వచ్చే అధికారులు, పోలీసులు, కలెక్టర్, విద్యాశాఖ ఉన్నతాధికారులు సైతం తమ మొబైల్ ఫోన్లను కేంద్రాల బయటపెట్టి తనిఖీలకు వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులు తనిఖీలు చేసిన తర్వాతే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. అందుకు విరుద్ధంగా ఎవరైనా సిబ్బంది సెల్‌ఫోన్లను కేంద్రాలకు తీసుకెళ్తే వారిని సస్పెండ్ చేస్తారు. ప్రశ్నపత్రం లీకేజీకి పాల్పడితే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తారు.

ఆరు కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన ఆరింటిపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఈ ఆరు కేంద్రాలకు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి నిఘా నీడలో పరీక్షలు నిర్వహించనున్నారు. పిటికాయగుళ్ల, పైడిపాడు, సీఎస్‌పురం, యాచవరం, రాచర్ల జడ్పీ హైస్కూలు, కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని కేంద్రాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది కొమరోలులో కిటికీ ద్వారా ప్రశ్నపత్రం బయటకు వచ్చింది. జవాబులు జిరాక్స్‌లు తీసి విద్యార్థులకు అందజేశారు. సీఎస్‌పురం పరీక్షా కేంద్రంలో గుట్టలుగా కాపీలు దొరికాయి. పిటికాయగుళ్ల, పైడిపాడు పరీక్షా కేంద్రాలు ఎప్పటినుంచో మాస్ కాపీయింగ్‌కు పేరుగాంచాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఈ కేంద్రాలకు ప్రత్యేకంగా పోలీస్ నిఘా కూడా ఏర్పాటు చేస్తున్నారు.

పరీక్ష రోజుల్లో పాఠశాలలకు సెలవు

పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లోని ఇతర తరగతులకు పరీక్షలు జరిగినన్ని రోజులు సెలవు ప్రకటించారు. కొన్ని కేంద్రాల్లో ఉదయం రెగ్యులర్ పదవ తరగతి, మధ్యాహ్నం ఓపెన్ స్కూలు సొసైటీ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇతర తరగతుల విద్యార్థులకు పరీక్షలు జరిగే రోజుల్లో సెలవులు ప్రకటించారు. పరీక్షలు ముగిసిన అనంతరం వారికి ఆదివారాలతో సహా ప్రభుత్వ సెలవుదినాల్లో ఆ విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

టీచర్ల బదిలీల్లో భారీ ముడుపులు

రూ.2 కోట్లు చేతులు మారిన వైనం

ఒంగోలు(విద్య), మార్చి 15 : జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు పొందేందుకు కొందరు అధికారులు, దళారులకు ఉపాధ్యాయులు భారీగానే ముడుపులు ముట్టజెప్పారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 98 మంది టీచర్లు రెండు విడతలుగా బదిలీ ఉత్తర్వులు పొందారు. ఈ బదిలీలకు జిల్లాలోని టీచర్లు రూ.2కోట్లకుపైగా దళారులకు సమర్పించుకున్నట్లు తెలుస్తోంది. దళారులకు ముందుగా డబ్బులు ఇచ్చిన కొందరికి తీరా బదిలీ ఉత్తర్వులు రాకపోవడంతో తాము మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సుల లేఖలు పొంది దళారుల ద్వారా పనిచక్కబెట్టుకున్నారు. కొందరైతే అడ్వాన్స్‌గా సగం మొత్తం తీసుకొని మిగిలింది ఉత్తర్వులు వచ్చాక వసూలు చేసుకున్నారు. మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల సిఫార్సు చేసిన వారికి ఉచితంగానే బదిలీ ఉత్తర్వులు రాగా మిగిలిన వారు మాత్రం బదిలీ ఉత్తర్వులకు ఒక్కొక్కరు కనీసం రూ.3లక్షల వరకు చెల్లించినట్లు చెపుతున్నారు. బదిలీ ఉత్తర్వులు పొందిన వారు మే 31న కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంది. ఎస్‌జీటీలు 40మంది, హైస్కూలు హెచ్‌ఎంలు ఎనిమిది మంది, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు నలుగురు, స్కూలు అసిస్టెంట్ గణితం 40మంది, పీఎస్ 9, ఇంగ్లీషు 6, తెలుగు 4, ఫిజికల్ ఎడ్యుకేషన్ 3, బయాజికల్ సైన్స్ 1, హిందీ 6, సోషల్ స్టడీస్ ఇద్దరు బదిలీ ఉత్తర్వులు పొందారు. ఎస్‌జీటీల ఉత్తర్వులు ఎంఈఓలకు, స్కూలు అసిస్టెంట్ ఉత్తర్వులు సంబంధిత హెచ్‌ఎంలకు శుక్రవారం అందజేశారు.

చీకటి పాలనను తరిమేయాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

కనిగిరి, మార్చి 15: రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న చీకటి పాలనను తరిమేయాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో పార్టీ నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలు అభివృద్ధి వైపు దూసుకుపోతే జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పాతాళంలోకి పోయిందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు విధ్వంసానికి గురయ్యాయని ఆరోపించారు. అన్ని రకాల వస్తువులపై ధరలు విపరీతంగా పెంచేసి సామాన్యుడి బతుకు జీవనాన్ని కష్టంగా మార్చిన వ్యక్తి జగన్‌రెడ్డి అన్నారు. రైతులు, యువత, ఉద్యోగులు కార్మికులు, కర్షకులు, మహిళలు, పేదలు అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు గురి చేసి జగన్ రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని సహజ సంపదలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను జగన్ దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మళ్లీ గెలిచేందుకు జగన్ కుయుక్తులు, కుట్రలు పన్నేందుకు సిద్ధమయ్యారన్నారు. ఓటర్ల లిస్టులో గుట్టు చప్పుడు కాకుండా అక్రమాలకు పూనుకుంటున్నారన్నారు. ఇప్పటి నుంచి ప్రతి నాయకుడూ, కార్యకర్త అప్రమత్తంగా ఉండి వైసీపీ అడ్డదారి వ్యూహాలను తిప్పికొట్టాలని సూచించారు. ప్రజలు కూడా మరోసారి మోసపోకుండా విజ్ఞతతో ఓటును వినియోంచుకోవాలని కోరారు. టీడీ పీ పాలనలో పోలవరం శరవేగంగా 75శాతం పూర్తి చేసిన ఘనత చంద్రబాబుదే అని గుర్తుచేశారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణం కోసం కేంద్రం నిధులు ఇస్తామంటే వాటిని తిరస్కరించి జగన్ రాష్ట్రాభివృద్ధికి తీరని ద్రోహం చేశరన్నారు. రాక్షసులను అంతమొందిచేందుకు దేవతలందరూ ఏకమైనట్లు పురాణాలు చెప్తున్నాయన్నారు. రాష్ట్రంలో జగనాసురుడి పాలనను అంతమొదించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీలు ఏకమయ్యాయన్నారు. ఈ కూటమిని ప్రజలు ఆశీర్వదించాలన్నారు. అన్ని గ్రామాల్లో మూడు పార్టీలకు చెందిన నాయకులు ఏకమై టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎన్నికల గడువు నెలరోజులు మాత్రమే ఉందని శ్రేణులు, నాయకులు సమాయత్తం కావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మెజార్టీ గత రికార్డులను బద్దలుగొట్టాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న చిలకలూరిపేటలో జరిగే కూటమి సభకు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు కనిగిరి టౌన్ పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

అయ్యన్నకోటలో వైసీపీని వీడిన 100 కుటుంబాలు

ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిక

పామూరు, మార్చి 15 : జగన్‌రెడ్డి అరాచక పాలనతో విసుగుచెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరడం కూటమి విజయానికి సంకేతమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ ఇల్లూరి రామిరెడ్డి, ఆయన తనయుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఉగ్ర పాల్గొన్నారు. మండలంలోని అయ్యన్నకోట గ్రామంలో సానికొమ్ము విజయ భాస్కరరెడ్డి, కుందూరు తిరుపతిరెడ్డి, తుమ్మ ఆంజనేయులు ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు వైసీపీని వీడి ఉగ్ర సమక్షంలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఉగ్ర పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జీ దశరథరామయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ బీ జయరామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కేతు విజయబాస్కరరెడ్డి, ఏ ప్రభాకర్‌చౌదరి, యారవ శ్రీను, సయ్యద్ అమీర్‌బాబు, వై.ప్రసాద్‌రెడ్డి, షేక్ ఖాజారహంతుల్లా, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, రమణయ్య వీరబాబు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో డాక్టర్ ఉగ్ర

టీడీపీలో జోష్

ఒకవైపు పార్టీలోకి పెద్దఎత్తున వివిధ వర్గాల చేరికలు, మరోవైపు బాబు ష్యూరిటీ- సూపర్ సిక్స్‌పై ఇంటింటి ప్రచారం, ఇంకోవైపు 17న బొప్పూడి వద్ద టీడీపీ కూటమి నిర్వహించే బహిరంగ సభ సక్సెస్ చేయడం కోసం ఏర్పాట్లు తదితర కార్యక్రమాలతో జిల్లాలోని ఏ ప్రాంతంలో చూసినా టీడీపీ అభ్యర్థులు ప్రస్తుతం బిజీబిజీగా మారిపోయారు. అదే సమయంలో టీడీపీ కేడర్ కూడా ఈ పరిణామాలతో మరింత జోష్‌గా కనిపిస్తున్నారు.
దీనికితోడు ఇప్పటికే దాదాపు అభ్యర్థుల ప్రకటన కూడా పూర్తయ్యింది. దీంతో ఎప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా సిద్ధం అన్నట్లు తెలుగుదేశం పార్టీ పరిస్థితి నెలకొంది.



టీడీపీలో చేరిన 21వ డివిజన్‌కు చెందిన వైసీపీ కుటుంబాలతో దామచర్ల

- చేరికలు..ఇంటింటి ప్రచారం..
- ప్రజాగళం సభ సక్సెస్ కోసం ఏర్పాట్లు
- బిజీబిజీగా ఎమ్మెల్యే అభ్యర్థులు
- జోరు మీద ఉన్న పార్టీశ్రేణులు
- నేడు చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరనున్న ఎంపీ మాగుంట, మరి కొంతమంది

ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గతంలో నామినేషన్ల దాఖలు సమయం వరకు టీడీపీలో అభ్యర్థులు ఎంపిక కొలిక్కి వచ్చేది కాదు. అలాంటిది ఈసారి అధినేత చంద్రబాబు అందుకు భిన్నంగా ముందే ప్రకటించారు. జిల్లాలోని ఎనిమిది స్థానాల్లో ఐదింటికి పదిరోజుల క్రితం తొలి జాబితాలోనే అభ్యర్థులను ప్రకటించగా మిగిలిన మూడు స్థానాల్లో ఇద్దరిని గురువారం ప్రకటించారు. అలా అసెంబ్లీ అభ్యర్థులు ఏడుగురు ఖరారు కాగా ఒంగోలు పార్లమెంట్ నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా మాగుంట రాఘవరెడ్డి పోటీ చేస్తాడన్న స్పష్టత వచ్చింది. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించడం తెలిసిందే. అంతేకాక కుమారుడు రాఘవరెడ్డితోపాటు అనుచరులతో కలిసి శనివారం ఉండవల్లిలో అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఈ పరిణామాలన్ని జిల్లాలోని టీడీపీ కేడర్‌లో జోష్‌ను పెంచాయి. అదే సమయంలో అసెంబ్లీ అభ్యర్థులుగా ఖరారైన వారు ఎన్నికల ప్రక్రియలో తీసుకొనే చర్యలలో మరింత వేగం పెంచారు.

ఇప్పటికే ప్రజల్లోకి..

ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఇప్పటికే ఇన్‌చార్జులుగా అధినేత రూపొందించిన బాబు ష్యూ రిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం పేరుతో ప్రజల మధ్య ఉం టున్నారు. అలాంటిది ప్రస్తుతం ఎన్నికల క్యాంపెయిన్‌గానే దానిని నిర్వహిస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సం క్షేమ కార్యక్రమాలు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ పోకడ, వైఫల్యాలు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, వైసీపీ నేతల అవినీతి, అరాచక వ్యవహారాలను ప్రజల్లో ఎండగడుతున్నారు. దాంతో పాటు టీడీపీ మేనిఫెస్టో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. అలా నిత్యం ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

గతంలో ఎన్నడూలేని విధంగా చేరికలు

మరోవైపు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా నియోజకవర్గాల్లో వైసీపీని వీడి నిత్యం వందలాది కుటుంబాల వారు టీడీపీలో భారీగా చేరుతున్నారు. ప్రతి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సమక్షంలో నిత్యం ఇలా పెద్దసంఖ్యలో చేరుతున్నారు. తాజాగా టీడీపీ, జనసేనతోపాటు కూటమిలోకి బీజేపీ కూడా చేరిన నేపథ్యంలో చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలోని బొప్పూడి వద్ద భారీ బహిరంగసభను ఈనెల 17న కూటమి తరఫున ఏర్పాటు చేశారు. దానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్న తెలిసిందే. సభ జరిగే బొప్పూడి ఉమ్మడి జిల్లా సరిహద్దు కావడంతో ఆ సభకు జిల్లా నుంచి భారీ జన సమీకరణ చేయాలని అధిష్ఠానం నుంచే సంకేతాలు అందాయి. దీంతో రెండు రోజులుగా అందుకు సంబంధించి ఏర్పాట్లపై ప్రత్యేకదృష్టిని వారు సారించారు. అ లా ఒకవైపు భారీగా పార్టీలోకి చేరికలు, మరోవైపు ఇంటింటా ప్రచారం, ఇంకొకవైపు బొప్పూడి సభ సక్సెస్ కోసం ఏర్పాట్లతో నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఇతర ముఖ్య నేతలు తీరిక లేకుండా పనిచేస్తున్నారు. శుక్రవారం కూడా అన్ని నియోజకవర్గాల్లోనూ ఇలాంటి పరిస్థితే కనిపించింది.

ముఖ్యనేతలతో భేటీలు

ఆయా ప్రాంతాల్లో పరిశీలిస్తే కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి బొప్పూడి సభ ఏర్పాట్లపై కొండపి, టంగుటూరుల్లో పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేశారు. పొన్నలూరు మండలం జడ్.ఉప్పలపాడులో రాత్రికి టీడీపీలో భారీగా చేరికలు జరిగాయి. ఒంగోలులో మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సమక్షంలో నగరంలోని 21వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులతోపాటు పలువురు ఇతర వర్గాల వారు టీడీపీలో చేరారు. అలా చేరిన వారిలో రిటైర్డ్ తహసీల్దార్ కూడా ఉన్నారు. సంతనూతలపాడు టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయకు మార్ నియోజకవర్గ ముఖ్యనేతలతో భేటీ అయ్యారు. బొప్పూడి సభకు జనసమీకరణ అంశాలపై చర్చించారు. అలాగే రాత్రికి చీమకుర్తి మండలం కేవిపాలెంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కనిగిరి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో పార్టీలో చేరికలు వెల్లువెత్తుతున్నాయి. ఉగ్ర సమక్షంలో సీఎస్‌పురం, పామూరు మండలాలకు చెందిన వారు పార్టీలో చేరగా సాయంత్రం బొప్పూడి సభపై టీడీపీ జనసేన సంయుక్త సమావేశం జరిగింది. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు గెలుపు కోరుతూ శుక్రవారం ఉదయం దోర్నాల మండలం అయినముక్కల ఎస్సీ కాలనీవాసులు శ్రీశైలానికి చేపట్టిన పాదయాత్రను ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు సాయంత్రం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్ సమక్షంలో పుల్లలచెరువు మండల వైసీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి పార్టీలో చేరిక కార్యక్రమంలో పాల్గొన్నారు. గిద్దలూరు అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి సమక్షంలో పలు కుటుంబాల వారు శుక్రవారం టీడీపీలో చేరారు. అలాగే మార్కాపురం నియోజకవర్గంలో పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జీ కందుల రామిరెడ్డి సమక్షంలో చిన్నరాయుడుపల్లి వాసులు టీడీపీలో చేరారు. అలాగే పట్టణంలోని 15వ వార్డులో ఇంటింటి ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఆ కార్యక్రమాల్లో స్థానిక జనసేన నేతలు కూడా పాల్గొంటున్నారు.

నేడు మాగుంట టీడీపీలో చేరిక

ఒంగోలు అనుచరులతో కలిసి ర్యాలీగా బయలుదేరనున్న ఎంపీ

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే వైసీపీ అధినేత, సీఎం జగన్ అనుసరించిన విధానాలతో వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ తన కుమారుడు, యువ పారిశ్రామికవేత్త రాఘవరెడ్డితో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు. జిల్లావ్యాప్తంగా మాగుంటకు పెద్దఎత్తున అనుచరులు, అభిమానులు ఉన్నారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో అభిమానులు టీడీపీలో చేరగా మాగుంట వెం ట నడిచే ముఖ్య అనుచరులు ఆయనతో పాటు టీడీపీలో చేరనున్నారు. శనివారం మధ్యాహ్నం 12గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయం నుంచి ఉండవల్లి బయలుదేరనున్నారు. 250కిపైగా వాహనాలను ఏర్పాటుచేశారు. భారీసంఖ్యలో మాగుంట అనుచరులు, అభిమానులు టీడీపీలో చేరుతుండటంతో వైసీపీలో అలజడి నెలకొంది.

వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన మండల కన్వీనర్
- క్షేత్రస్థాయిలో అధికారపార్టీకి చేజారుతున్న కేడర్
- గెలుపు కసితో పనిచేస్తున్న టీడీపీ కార్యకర్తలు



లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, సర్పంచులు, నాయకులు

పుల్లలచెరువు, మార్చి 15: పుల్లలచెరువు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. వైసీపీని విడి ఆ పార్టీ మండల కన్వీనరు రెంటపల్లి సుబ్బారెడ్డి టీడీపీలో చేరారు. శుక్రవారం ఆయన వైసీపీ కన్వీనరు పదవికి రాజీనామా చేసి ఉండవల్లిలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ సమక్షంలో వై.పాలెం ఇన్‌చార్జ్ గుడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో టీడీపీ చేరారు. ఆయనతోపాటు కవలకుంట్ల సర్పంచి భర్త ఆవుల వెంకటరెడ్డి, మానేపల్లి సర్పంచి భర్త చిన్నపురెడ్డి రమణారెడ్డి, ఐటీవరం ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాగులూరి సామ్యేలు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోగిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో పాటు వారి అనుచరులు టీడీపీలో చేరారు. మండలంలో మంచి పట్టున్న నేత పార్టీ మారకుండా ఒత్తిడి చేసినప్పటికీ వారు టీడీపీలో చేరడం గమనార్హం. నియోజకవర్గంలో వున్న అసమ్మతితో పాటు, జగన్ పాలన విధానం నచ్చక పోవడంతో ఆయన టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. వీరితో పాటు మండలంలో భారీగా వలసలు వుండే అవకాశం వుంది. రెంటపల్లి చేరికలో వైసీపీ కేడర్ ని రుత్సాహ పడుతోంది. కేడర్ చేజారుతుంది. టీడీపీలోకి వరుసగా వలసలు వస్తున్నాయి. దీంతో టీడీపీ కేడరు జోరుగా ఉంది. ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు కేడర్ కసితో పనిచేస్తుండగా, వైసీపీ నుంచి మరిన్ని వలసలు ఉండే అవకాశం ఉంది.

నేడు మోగనున్న నగారా

- సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌పై సీఈసీ స్పష్టత
- ఎనిమిది సెగ్మెంట్లు, 17,99,706 మంది ఓటర్లు, 2,183 పోలింగ్ కేంద్రాలు
- ఇప్పటికే పలు ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం



ఒంగోలు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నగరా శనివారం మోగనుంది. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) స్పష్టత ఇచ్చింది. దీంతో ప్రజానీకం ప్రత్యేకించి రాజకీయవర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల అధికారిక ప్రక్రియ ప్రారంభం కానుంది. వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుంది. అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరగనున్నాయి. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పాలన్న బలమైన ఆకాంక్ష అనేక వర్గాల ప్రజల్లో బలంగా కనిపిస్తున్న నేపథ్యంలో ఈ విడత ఎన్నికలకు మరింత ప్రాధాన్యత ఏర్పడింది. జిల్లాల విభజన తర్వాత జరుగుతున్న తొలి సార్వత్రిక ఎన్నికలు కూడా ఇవే కానున్నాయి. గతంలో జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా మూడు పార్లమెంట్ స్థానాల్లో అవి అంతర్భాగంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉండగా అందులో ఏడు ఒంగోలు పార్లమెంట్‌లోనూ, మరొకటి బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉంది.

మహిళా ఓటర్లే అధికం

కాగా జిల్లాలోని ప్రస్తుత ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో ఈ ఏడాది జనవరిలో అధికార యంత్రాంగం ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలే అధికంగా ఉన్నారు మొత్తం 9,02,749 మంది మహిళా ఓటర్లు ఉండగా 8,96,859 మంది పురుషులు, 98 మంది థర్డ్‌జండర్ ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం ఓటర్లలో తొలిసారి ఓటు హక్కు పొందిన వారు 36996 మంది కాగా సర్వీసు ఓటర్లు 6815 మంది ఉన్నారు. అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో 2,37,079మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,05,300 మంది ఉన్నారు. ఇక ఎనిమిది నియోజకవర్గాల్లో మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

యంత్రాంగం విస్తృత కసరత్తు

ఇదిలా ఉండగా జిల్లా యంత్రాంగం గత మూడు నెలలుగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై విస్తృత కసరత్తు చేసింది. కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ నేతృత్వంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అధికారులు ప్రత్యేకించి ఎన్నికల నిర్వహణలో కీలకమైన రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం పూర్తిగా ఈ పనిలో నిమగ్నమయ్యారు. ఓటర్ల జాబితా సవరణ మొదలు పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చేర్పులు, మార్పులు, ఈవీఎంల పరిశీలన, కౌంటింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ సిబ్బంది గుర్తింపు తదితరాలు పూర్తిచేశారు. ఒంగోలు పార్లమెంట్‌కు కలెక్టర్ దినేష్‌కుమార్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తుండగా అసెంబ్లీ సెగ్మెంట్లకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు రిటర్నింగ్ అధికారులుగా నియమితులయ్యారు. వారి పర్యవేక్షణలో అటు జిల్లా ఇటు నియోజకవర్గ స్థాయిలో అన్ని ఏర్పాట్లు, రాజకీయ పక్షాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. శనివారం ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రానుండగా ఆ వెంటనే ఎన్నికల కోడ్ అమలులోకి వస్తోంది. కోడ్ అమలుకు కూడా అధికారులు చర్యలు చేపట్టారు.

వాహనదారులకు స్వల్ప ఊరట

డీజిల్, పెట్రోలు లీటరుకు రూ.2 తగ్గింపు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 15: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం వాహన దారులకు స్వల్ప ఊరట కలిగించింది. పెట్రోలు, డీజిల్‌కు లీటరకు రూ.2 తగ్గించింది. నిన్నటి వరకు డీజిల్ లీటర్ రూ.98.54 ఉండగా పెట్రోలు రూ.110.72 ఉంది. కేంద్రప్రభుత్వం తగ్గించిన ధరలు శుక్రవారం నుంచి అమలులోకి వచ్చాయి. శుక్రవారం ఒంగోలులో డీజిల్ లీటరు రూ.96.54 ఉండగా, పెట్రోలు రూ.108.72 ఉంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొంత మేర వినియోగదారులకు ఊరట కలిగింది.

18 నుంచి ఒంటిపూట బడులు

ఒంగోలు(విద్య), మార్చి 15 : ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలన్నింటిలో ఈనెల 18 నుంచి విద్యార్థులకు ఉదయం ఒక్కపూటే తరగతులు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఉదయం 7.45 నుంచి 12.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు ఒంటిపూట బడులు నిర్వహించే టప్పుడు పాఠశాలల్లో వేసవి జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి. 12.30 గంటలలోపు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టి పంపించాలి. దాతల సహకారంతో మజ్జిగ సరఫరా చేయాలని కమిషనర్ సూచించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- కేంద్రాల వద్ద సందడి వాతావరణం
- కేరింతల కొట్టిన విద్యార్థులు



పరీక్షలు పూర్తయిన అనంతరం కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), మార్చి 15: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. సీనియర్ ఇంటర్ విద్యార్థులకు కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షకు 18,072 మంది హాజరు కావాల్సి ఉండగా 17,011 మంది హాజరుకాగా 1,061 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఒక్క విద్యార్థి కూడా మాల్‌ప్రాక్టిస్ కింద బుక్ కాలేదు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. వారి హడావుడితో కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అలాగే ఆయా కాలేజీ వారు ఏర్పాటు చేసిన బస్సుల్లో వెళుతూ విద్యార్థులు నగరమంతా కేకలతో హోరెత్తించారు. అలాగే పేపర్లు చించి రోడ్లపై చల్లుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే హస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు సూటు కేసులు సర్దుకొని స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

ప్రజాగళం సభకు భారీగా తరలిరండి

టీడీపీ ఇన్‌చార్జ్ గోరంట్ల

ముండ్లమూరు, మార్చి 15 : పల్నాడు జిల్లా చిలకలూరుపేటలో ఆదివారం జరిగే ప్రజాగళం సభకు నియోజక వర్గంలోని ఐదు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పార్టీ దర్శి ఇన్‌చార్జి గోరంట్ల రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని పోలవరం, శంకరాపురం మధ్య సభ కోసం వచ్చే టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏర్పాటు చేస్తున్న భోజన ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించారు. అనంతరం హాజరైన దర్శి, కురిచేడు, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల నాయకులతో మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున సభకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మరో రెండు నెలల్లో వైసీపీ ప్రభుత్వం కూలిపోనుందన్నారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే టీడీపీకి 160 స్థానాలకు పైగా వస్తాయనడంలో ఎలాంటి ఢోకా లేదన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. అభివృద్ధి అనే మాటే లేదన్నారు. కార్యక్రమంలో ముండ్లమూరు, తాళ్లూరు, దొనకొండ మండలాల టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, ఓబులరెడ్డి, నాగులపాటి శివ కోటేశ్వరరావు, జిల్లా టీడీపీ నాయకులు మానం రమేష్ బాబు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సోమేపల్లి శ్రీనివాసరావు, కే నాగరాజు, కూరపాటి నారాయణ స్వామి, నిడమానూరి శ్రీనివాసరావు, జిల్లెలమూడి చౌదరి, రావెల శ్రీనివాసరావు, మధు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి కొర్రపాటి బుచ్చిబాబు, పవన్, పాలెపోగు రాజు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి గోరంట్ల, టీడీపీ నాయకులు